



RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.

సంచిక : 309 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | బుధవారం | 25-02-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00



## భారత్‌ను అమెరికాకు అమ్మేశారు

- అమెరికాకు తలొగ్గిన ప్రధాని మోడీ
- మరోమారు విమర్శలు గుప్పించిన రాహుల్

భోపాల్,
భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై విమర్శల దాడి చేశారు. మోదీ రాజీపడ్డారని, అమెరికా ఒత్తిడికి తలవంచారని ఆరోపించారు. భోపాల్‌లో మంగళవారంనాడు జరిగిన కాంగ్రెస్ కిసాన్ మహాచౌపాల్ కార్యక్రమంలో మాట్లాడుతూ, దేశాన్ని అమ్మేశారని, భారతీయుల డాటాను అమెరికా చేతిలో పెట్టారని మోదీని విమర్శించారు. 'వ్యవసాయం, వ్యవసాయ ఉత్పత్తులతో ముడిపడిన కారణంగా అమెరికాతో వాణిజ్య ఒప్పందం నాలుగు నెలలుగా నిలిచిపోయింది. పార్లమెంటు ప్రసంగంలో కేవలం ఆర్మీ మాజీ చీఫ్ నవరణెళి గురించే నేను మాట్లాడలేదు. నా ప్రసంగం పూర్తికాగానే సొంత మంత్రులను కూడా సంప్రదించ కుండా మోదీ ట్రంప్‌తో మాట్లాడారు. మహిళా ఎంపీలు దాడి చేయాలనుకున్నారంటూ అబద్ధాలు చెప్పారు. దానికి బదులుగా అమెరికాతో డీల్‌కు రెడీగా ఉన్నట్టు ఆయన సూటిగా చెప్పి ఉండవచ్చు. మోదీ కళ్లలో భయం స్పష్టంగా కనిపించింది' అని రాహుల్ అన్నారు.

-మిగతా 2 లో

# మావోయిస్ట్ పార్టీకి భారీ దెబ్బ

**దేవ్‌జీ సహా నలుగురు అగ్రనేతల లొంగుబాటు**

- మావోయిస్టు పార్టీ సంస్థాగత నిర్మాణం పతనం
- రాష్ట్ర ప్రభుత్వ పునరావాస చర్యలతో లొంగుబాట్లు
- పార్టీలో తెలంగాణకు చెందినవారు ఇంకా 11 మంది
- వారు కూడా జనజీవన స్రవంతిలో కలవాలి: డీజీపీ
- డీజీపీ సమక్షంలో లొంగిపోయిన తిప్పిరి తిరుపతి, మల్లా రాజిరెడ్డి, బడే చొక్కారావు, నూనె నర్సింహారెడ్డి
- అనారోగ్యంతోనే రహస్య జీవితం వదిలాం..
- ప్రజా సమస్యలపై ఇకపైనా పోరాటాలు చేస్తాం: దేవ్‌జీ
- నేపాల్‌లో గణపతి.. అదుపులోకి తీసుకున్న పోలీసులు?

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
తెలంగాణలో రూపుదిద్దుకున్న మావోయిస్టు విప్లవ పోరాటం ఇక్కడే ముగుస్తోందని రాష్ట్ర డీజీపీ శివధర్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న పునరావాస చర్యలను గమనించి మావోయిస్టులు లొంగిపోతున్నారని తెలిపారు. మంగళవారం మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ అప్రకటిత కార్యదర్శి తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ సహా నలుగురు అగ్రనేతలు పోలీసుల ఎదుట లొంగిపోయారు. హైదరాబాద్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో డీజీపీ సమక్షంలో దేవ్‌జీతోపాటు మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు మల్లా రాజిరెడ్డి

-మిగతా 2 లో





## నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- భారీగా ఏర్పాట్లు చేసిన బోర్డు
- బుధవారం నుంచి ప్రథమ, గురువారం నుంచి ద్వితీయ సంవత్సరం పరీక్షల నిర్వహణ
- రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో మొత్తం 1495పరీక్ష కేంద్రాలు ఏర్పాటు
- పరీక్షా కేంద్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

హైదరాబాద్,ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
ఇంటర్ వార్షిక పరీక్షలు ఈ నెల 25, బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఇంటర్ బోర్డు ఏర్పాట్లు పూర్తి చేసింది. బుధవారం నుంచి ప్రథమ, గురువారం నుంచి ద్వితీయ సంవత్సరం పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లన్నీ పూర్తి చేశామని ఇంటర్ విద్య కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో మొత్తం 1495పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఫస్టియర్‌లో 489126 మంది, సెకండియర్‌లో

-మిగతా 2 లో

## త్వరలో 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ 2.0'

- ప్రతి ప్రాంతాన్ని వృద్ధి పథంలోకి నడిపించాలన్నదే మా అజెండా
- తెలంగాణ సమగ్రాభివృద్ధికే 'క్యూర్ - ప్యూర్ - రేర్'
- 'గ్రోత్ ఎక్స్ 2026' సదస్సులో మంత్రి శ్రీధర్ బాబు




హైదరాబాద్, ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
తెలంగాణను అంతర్జాతీయ పెట్టుబడులకు గమ్యస్థానంగా మార్చాలనే లక్ష్యంతో.. త్వరలోనే 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ 2.0'కు శ్రీకారం చుట్టబోతున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని మరింత పరుగులు పెట్టించేలా, పెట్టుబడిదారులకు పూర్తిస్థాయిలో భరోసా కల్పించేలా, ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలిచేలా అందరితో చర్చించి ఈ కొత్త విధానాన్ని రూపొందిస్తామన్నారు.

-మిగతా 2 లో

## కేరళ..ఇకనుంచి కేరళం

- 'కేరళం'గా మారుస్తూ కేంద్ర క్యాబినెట్ ఏకగ్రీవంగా తీర్మానం
- ఇకపై రాష్ట్రాన్ని 'కేరళం' అని పిలిచేలా సంబంధిత బిల్లుకు కేంద్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది




న్యూఢిల్లీ
కేరళ రాష్ట్రం పేరును 'కేరళం'గా మారుస్తూ కేంద్ర క్యాబినెట్ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఇకపై రాష్టాన్ని 'కేరళం' అని పిలిచేలా సంబంధిత బిల్లుకు కేంద్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. మలయాళీ రాష్ట్రంలో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో తాజా నిర్ణయం అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. తమ రాష్ట్రం పేరును మార్చాలనే ప్రతిపాదనలు మలయాళీ ప్రజల నుంచి ఎప్పటినుంచో వినిపిస్తున్నాయి. కేరళను మలయాళంలో 'కేరళం' అని పిలుస్తారని.. ఆ దిశగా రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ 2023లో ప్రవేశపెట్టిన తీర్మానానికి

-మిగతా 2 లో




## మంత్రుల మాటలకు, సీఎం మాటలకు పొంతన లేదు

- రెండేళ్లుగా దేవాదుల నుంచి ఒక్క ఎకారా పారలేదు
- సాగునీరు అందించిన పాపాన పోలేదు
- నత్తనడకన వరంగల్ సూపర స్పెషాలిటీ నిర్మాణం
- అసెంబ్లీలో మైక్ కట్ చేయకుండా చర్చించడానికి సిద్ధం
- వరంగల్ ఆస్పత్రి నిర్మాణాలను పరిశీలించిన హరీష్ రావు

వరంగల్, ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండేళ్లలో దేవాదుల నుంచి ఒక్క ఎకరా భూమినీ సేకరించలేదని, సాగునీరూ అందించలేదని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. మంత్రుల మాటలకు, సీఎం మాటలకు పొంతన లేదన్నారు. ఈ ప్రభుత్వానికి డేట్‌లు, డెడ్‌లైన్‌లు మాత్రమే మారుతున్నాయని హరీశ్ రావు అన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై

-మిగతా 2 లో



## అమెరికాలో మంచు తుఫాన్ బీభత్సం


- 11 వేలకుపైగా విమాన సర్వీసులు రద్దు
- న్యూయార్క్‌లో ఎమర్జెన్సీ

వాషింగ్టన్,
అమెరికా ఈశాన్య ప్రాంతాలను భారీ మంచు తుఫాన్ 'హెర్నాండో' అతలాకుతలం చేస్తున్నది. న్యూయార్క్ నగరం మొదలు మసాచుసెట్స్ దాకా 8 రాష్ట్రాల్లో మంచు తుఫాన్ కమ్మేసింది. మేయర్ మమ్దానీ న్యూయార్క్‌లో ఎమర్జెన్సీ విధించారు. అత్యవసర రవాణా సేవలు తప్ప, ఏవీ అందుబాటులో ఉండవని ప్రకటించారు. అమెరికా వ్యాప్తంగా మంగళవారం నాటికి 11 వేలకుపైగా విమాన సర్వీసులు రద్దయ్యాయి.దాదాపు 5 లక్షలకు పైగా ఇండ్లు, ఇతర కార్యాలయాలకు విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. మసాచుసెట్స్‌లో 'వైట్ ఔట్' పరిస్థితులు నెలకొన్నందున రోడ్లపైకి రావొద్దని వాహన డ్రైవర్లను ఆదేశించారు. ఆదివారం, సోమవారం మన్‌హట్టన్ సెంట్రల్ పార్క్‌లో 50 సెంటీమీటర్ల మేర మంచు కురిసింది. పలు రాష్ట్రాల్లో ఎక్కడ చూసినా పెద్ద ఎత్తున మంచు పేరుకుపోయింది.

# జీహెచ్‌ఎంసీను పాగా వేస్తాం

**ప్రజా సమస్యలను ప్రజల్లోకి తీసుకువెళతాం**

- భాగ్యలక్ష్మీ అమ్మవారి ఆశీస్సులతోనే కరీంనగర్‌లో మేయర్ పీఠాన్ని కైవసం చేసుకున్నాం
- భాగ్యలక్ష్మీ ఆలయం ఎంతో పవర్‌ఫుల్
- భవిష్యత్తులో బీజేపీ అధికారంలోకి వస్తే పంజాబ్‌లోని స్వర్ణ దేవాలయం తరహాలో అభివృద్ధి చేస్తాం
- కేంద్రమంత్రి బండి సంజయ్ వెల్లడి



హైదరాబాద్ ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల ముందు ఉంచుతామని కేంద్రమంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో బిజెపి విజయం సాధిస్తుందని అన్నారు. కాంగ్రెస్ రెండేళ్ల వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకుని వెళతామని అన్నారు. భాగ్యలక్ష్మి అమ్మవారి ఆశీస్సులతోనే కరీంనగర్‌లో మేయర్ పీఠాన్ని కైవసం చేసుకున్నామని కేంద్ర మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. పాతబస్తీలోని భాగ్యలక్ష్మి ఆలయం వద్ద మొక్కులు తీర్చుకునేందుకే కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని కార్పొరేటర్లు, -మిగతా 2 లో

## కాంగ్రెస్ అధికార దుర్వినియోగం

- ప్రజాతీర్పు అపహాస్యం
- ఇష్టారాజ్యంగా బీజేపీ, కాంగ్రెస్ వ్యవహారం
- సీపీఐ కౌన్సిలర్లు పొత్తు ధర్మాన్ని పాటిస్తున్నారు
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ఆదిలాబాద్ జిల్లా జైలులో బాల్క సుమన్‌కు పరామర్శ



హైదరాబాద్ ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
మున్సిపల్ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ, కాంగ్రెస్ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డాయని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌తో ములాఖత్ అయ్యారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ..

-మిగతా 2 లో

## ఉక్రెయిన్‌కు నాటో దేశాల అణుబాంబు టెక్నాలజీ

- రష్యా ఇంటెలిజెన్స్ వెల్లడి
- ఫ్రాన్స్ తన జలాంతర్గాముల్లోని బాలిస్టిక్ క్షిపణలకు వాడే టీఎన్ 75 వార్‌హెడ్‌ను కీవ్‌కు అందజేసేందుకు ఆసక్తిగా ఉన్నట్లు రష్యా ఆరోపణ



మాస్కో
అణు బాంబు తయారీకి చెందిన పరికరాలను ఉక్రెయిన్‌కు నాటో దేశాలు ఇచ్చేందుకు ఆసక్తిగా ఉన్నట్లు రష్యా ఇంటెలిజెన్ ఓ నివేదికలో పేర్కొన్నది. నాటోలోని ఫ్రాన్స్, యూకే దేశాలు కొన్ని కాంపోనెంట్స్‌ను సరఫరా చేయనున్నట్లు రష్యా విదేశీ ఇంటెలిజెన్స్ సర్వీస్ వెల్లడించింది. అయితే ఆ కాంపోనెంట్స్‌ను ఉక్రెయిన్ అసెంబ్లింగ్ చేసి, స్వదేశీయంగా అణు బాంబును డెవలప్ చేసినట్లు ఉక్రెయిన్ చెప్పుకుంటుందని రష్యా ఇంటెలిజెన్స్ చెప్పింది. యురోపియన్ దేశాలు తయారు చేసే కాంపోనెంట్లు, ఈక్విప్మెంట్, టెక్నాలజీని ఉక్రెయిన్‌కు ట్రాన్స్‌ఫర్ చేసే ఆలోచనలో బ్రిటన్, ఫ్రెంచ్ అధికారులు ఉన్నట్లు తెలిసింది.ఫ్రాన్స్ తన జలాంతర్గాముల్లోని బాలిస్టిక్ క్షిపణలకు వాడే టీఎన్ 75 వార్‌హెడ్‌ను కీవ్‌కు అందజేసేందుకు ఆసక్తిగా ఉన్నట్లు రష్యా ఆరోపిస్తున్నది. రేడియోధార్మికత ఉన్న పదార్థాలతో డర్టీ బాంబును ఉక్రెయిన్ తయారు చేసే

-మిగతా 2 లో

# భారత్‌ను అమెరికాకు అమ్మేశారు

మొదటి తరువాయి

అమెరికా సుప్రీంకోర్టు తీర్పుతో ఆదేశంతో ట్రేడ్ ఒప్పందాలను వదులుకోవాలని ఇతర దేశాలు నిర్ణయం తీసుకుంటే, మోదీ మాత్రం మౌనంగా ఉండిపోయారని రాహుల్ విమర్శించారు. 'ఇదే వేదిక నుంచి మోదీని సవాలు చేస్తున్నాను. డీల్‌పై అమెరికా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినందున ఆ దేశంతో వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలి. ట్రంప్ ఒత్తిడి కారణంగానే డీల్‌ను మోదీ రద్దు చేసుకున్నారు. భారతదేశం అత్యధిక జనాభా కలిగిన దేశం. డాటా కూడా పెద్దదే. కానీ మోదీ మన డాటాను అమెరికాకు ఇచ్చేశారు. ఆయన మీద ఒత్తిడి లేకపోతే ఆ పని చేసేవారు కాదు. తన ప్రతిష్ట, రాజకీయ భవిష్యత్తును కాపాడుకునేందుకు దేశాన్ని ఆయన అమ్మేశారు' అని మోదీపై రాహుల్ తీవ్ర విమర్శలు చేశారు.

# నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

మొదటి తరువాయి




507949 మంది కలిపి మొత్తం 997075 మంది పరీక్షలకు హాజరుకానున్నారని వెల్లడించారు. పరీక్ష కేంద్రానికి 5 నిమిషాలు ఆలస్యంగా వచ్చినా అనుమతిస్తామని తెలిపారు. విద్యార్థుల రవాణాకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతుందని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు, గోడ గడియారాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షల సమయంలో ఒత్తిడి, ఆందోళన, మానసిక ఆవేదన లాంటి సమస్యలను అధిగమించేందుకు 14416, 80693 91416 నెంబర్లను అందుబాటులోకి తెచ్చామని, విద్యార్థులు ఈ నెంబర్లకు ఫోన్ చేసి కౌన్సెలింగ్ సేవలు పొందవచ్చని కృష్ణ ఆదిత్య తెలిపారు.

# కేరళ..ఇకనుంచి కేరళం

మొదటి తరువాయి

అసెంబ్లీ ఆమోదం తెలిపింది. అయితే.. కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు కొన్ని మార్పుల అనంతరం కేరళ అసెంబ్లీ మరోసారి ఆ తీర్మానాన్ని ఆమోదించింది. ఆ తర్వాత ఇది ఇన్నాళ్లూ కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉండగా.. ఎట్టకేలకు మంగళవారం గ్రీన్ సిగ్నల్ లభించింది. ఢిల్లీలో ఇటీవల ప్రారంభమైన నూతన 'సేవా తీర్థం' భవనంలో జరిగిన మొదటి క్యాబినెట్ సమావేశం ఇది. మొదటి తీర్మానాన్ని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సమీక్షించిన అనంతరం.. కొన్ని సాంకేతిక మార్పులతో కేరళ అసెంబ్లీ రెండోసారి ఈ తీర్మానాన్ని ఆమోదించింది. ఈ తీర్మానాన్ని ప్రతిపాదించిన ఆ రాష్ట్ర సీఎం పినరయి విజయన్.. రాజ్యాంగంలోని మూడో అధికరణ ప్రకారం.. ఎనిమిదవ షెడ్యూల్‌లో చేర్చిన అన్ని భాషలలో 'కేరళం'గా సవరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. తీర్మానాన్ని ప్రతిపాదిస్తున్న సందర్భంలో ఆయన మాట్లాడుతూ.. మలయాళంలో రాష్టాన్ని 'కేరళం' అని పిలుస్తారని, జాతీయ స్వాతంత్ర్య పోరాట సమయం నుంచి మలయాళం మాట్లాడే వర్గాల కోసం ఐక్య కేరళను ఏర్పాటు చేయాలనే డిమాండ్ బలంగా ఉద్భవించిందని అన్నారు.

# మంత్రుల మాటలకు, సీఎం మాటలకు పొంతన లేదు

మొదటి తరువాయి

మాజీ మంత్రి హరీశ్ రావు మరోసారి విరుచుకుపడ్డారు. మంగళవారం వరంగల్‌లో నిర్మాణంలో ఉన్న 24 అంతస్తుల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులను మాజీ మంత్రి పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దేవాదుల ప్రాజెక్ట్‌ను తాము సందర్శించిన వెంటనే సీఎం రివ్యూ చేశారని.. తాము తట్టిలేపితేనే సీఎం నిద్ర లేస్తున్నారని వ్యాఖ్యానించారు. దేవాదుల ప్రాజెక్ట్ మొదటి ప్రాధాన్యమని చెబుతూనే పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. గోదావరి నీళ్లను పొలాలకు మళ్లించింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని.. కాంగ్రెస్ ఏమీ చేయలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పేర్కొన్నారు. అసెంబ్లీలో కెమెరా తిప్పకుండా, మైక్ కట్ చేయకుండా చర్చించే దమ్ము సీఎంకు ఉందా అని ఈ సందర్భంగా ఆయన ప్రశ్నించారు. దేవాదుల ప్రాజెక్ట్‌లో 90 శాతం పనులు పూర్తయ్యాయని, 10 శాతం మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని.. త్వరలో పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పేదల కోసం కేసీఆర్ హెల్త్ సిటీ నిర్మిస్తే.. రేవంత్ రెడ్డి ఫ్యూచర్ సిటీ కోసం పనిచేస్తున్నారని విమర్శించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం రేవంత్ రెడ్డిదని.. పేదల కోసం పనిచేసే ఆలోచన కేసీఆర్‌ది అని ఆరోపించారు. వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిపై నిర్లక్ష్యం చేయవద్దని హరీశ్ రావు అన్నారు. కేసీఆర్‌కు పేరు వస్తుందని పనులు చేయట్లేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ నేరపూరిత నిర్లక్ష్యం కారణంగా ఆసుపత్రి ప్రారంభం కావట్లేదని విమర్శించారు. రెండేళ్లు ఓపిక పట్టామని.. ఇక నిలదీస్తామని, గల్లా పట్టి అడుగుతామని హెచ్చరించారు. అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే బీఆర్ఎస్ నిరసన దీక్షలకు దిగుతుందని వార్నింగ్ ఇచ్చారు. వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో ఏడాదిన్నరగా గుండె శస్త్ర చికిత్సలు ఆగిపోయాయని తెలిపారు. ఎంజీఎంలో 3 ఆక్సిజన్ జనరేషన్ ప్లాంట్లు పెట్టామని, ఇప్పుడు ఒక్కటి కూడా పనిచేయట్లేదని ఆయన విమర్శలు గుప్పించారు.

# ఉక్రెయిన్‌కు నాటో దేశాల అణుబాంబు టెక్నాలజీ

మొదటి తరువాయి

అవకాశాలు ఉన్నట్లు రష్యా ఇంటెలిజెన్స్ పేర్కొన్నది. అయితే నాటోలో కీలకమైన జర్మనీ మాత్రం ఈ ప్రక్రియను వ్యతిరేకిస్తున్నట్లు రిపోర్టులో తెలిపారు. ఒకవేళ నాటో దేశాలు ఉక్రెయిన్‌కు అణు టెక్నాలజీ అందిస్తే అప్పుడు ఆ బాధ్యత వారిపైనే ఉంటుందని రష్యా పేర్కొన్నది.

# మావోయిస్ట్ పార్టీకి భారీ దెబ్బ

మొదటి తరువాయి



అలియాస్ సంగ్రామ్, తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి బడే చొక్కారావు అలియాస్ దామోదర్, రాష్ట్ర కమిటీ సభ్యుడు నూనె నర్సింహారెడ్డి అలియాస్ గంగన్న లొంగిపోయారు. ఈ సందర్భంగా శివధర్‌రెడ్డి మాట్లాడుతూ.. నలుగురు అగ్రనేతలు లొంగిపోవడం ద్వారా మావోయిస్టు పార్టీ అత్యున్నత సంస్థాగత నిర్మాణం పతనమైందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభ్యర్థన మేరకు లొంగిపోతున్న మావోయిస్టుల పునరావాసానికి కట్టుబడి ఉంటామని, వారి ప్రాణాలకు తమ ప్రాణాలు అడ్డువేసి కాపాడుతామని ప్రకటించారు. గతేడాది నుంచి నేటి వరకు నలుగురు కేంద్ర కమిటీ సభ్యులు, 16 మంది రాష్ట్ర కమిటీ సభ్యులు, 26 మంది జిల్లా కమిటీల సభ్యులు, 85 మంది ఏరియా కమిటీ సభ్యులతోపాటు 460 మంది మావోయిస్టు పార్టీ కార్యకర్తలు కలిపి మొత్తం 591 మంది లొంగిపోయారని వెల్లడించారు. లొంగుబాటే కాకుండా తెలంగాణ ఎస్ఐబీ తీసుకున్న చర్యల వల్ల వీరు ఆయుధాలు కూడా అప్పగించారని, మొత్తం 142 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మావోయిస్టు పార్టీ సంస్థాగత నిర్మాణం కుప్పకూలే దిశగా సాగుతుందన్న విషయాన్ని ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయని పేర్కొన్నారు.

**కేంద్ర కమిటీలో మరో ముగ్గురే..**

మావోయిస్టులకు మద్దతిచ్చే వర్గాలు క్షీణించడం, క్యాడర్ల కదలికలపై పరిమితులు పెరగ డం, నిరంతర కూంబింగ్ చర్యలు, సిద్ధాంతపరమైన అసంతృప్తి నేపథ్యంలో.. మిగిలిన వారిలోనూ తీవ్రమైన అంతర్మథనం జరుగుతోందని డీజీపీ శివధర్‌రెడ్డి అన్నారు. ఇంకా కేంద్ర కమిటీలో ముగ్గురు సభ్యులు ముప్పాళ్ల లక్ష్మణరావు, మిసిర్ బెస్రా, నరహరి ఉన్నారని, వీరిలో లక్ష్మణరావు అడవుల్లో లేరని, ఆయన వృద్ధాప్య సమస్యలతో ఎక్కడో చికిత్స పొందుతున్నట్లుగా సమాచారం ఉందని తెలిపారు. లక్ష్మణరావు, ఆయన భార్య జోడేబాయి కూడా ముందుకొచ్చి లొంగిపోతే వారికి మెరుగైన వైద్య చికిత్స అందిస్తామని హామీ ఇచ్చారు. మావోయిస్టు పార్టీలో తెలంగాణకు చెందినవారు ఇంకా 11 మంది వివిధ క్యాడర్లలో పలు రాష్ట్రాల్లో పనిచేస్తున్నారని, వారంతా కూడా త్వరగా వచ్చి జనజీవన స్రవంతిలో కలవాలని పిలుపునిచ్చారు. అగ్రనేతల లొంగుబాటు విషయంలో చొరవ చూపి మానవతా దృక్పథంతో చర్యలు తీసుకున్న స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) ఐజీ సుమతి, ఆమె సిబ్బందిని డీజీపీ అభినందించారు. ఇదిలా ఉండగా.. త్వరలో మావోయిస్టు పార్టీలోని వివిధ క్యాడర్లకు చెందిన 50 మందికి పైగా ఆయుధాలతో లొంగిపోనున్నట్లు సమాచార

# త్వరలో 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ 2.0'

మొదటి తరువాయి

మంగళవారం జూబ్లీహిల్స్ లోని జేఆర్సీ కన్వెన్షన్ సెంటర్ లో ది ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఫ్యాప్సీ) ఆధ్వర్యంలో నిర్వహించిన 'గ్రోత్ ఎక్స్ 2026' సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.... గ్రోత్ అంటే యాదృచ్ఛికంగా వచ్చేది కాదని, భావి తరాల భవిష్యత్తు కోసం శాస్త్రీయంగా, ప్రణాళికాబద్ధంగా రూపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆ దిశగానే రాష్ట్ర ప్రభుత్వం 'తెలంగాణ విజన్ 2047' ను రూపొందించిందన్నారు. ప్రస్తుతం 200 బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఉన్న తెలంగాణను, 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్లకు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చాలన్నదే తమ లక్ష్యమని పునరుద్ఘాటించారు. ఈ లక్ష్య సాధనకు, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి 'క్యూర్ – ప్యూర్ – రేర్' అనే త్రిముఖ




వ్యూహానికి శ్రీకారం చుట్టి అమలు చేస్తున్నామ న్నారు. నగరం నుంచి గ్రామం వరకు ప్రతి ప్రాంతాన్ని వృద్ధి పథంలోకి తీసుకెళ్లడమే తమ అజెండా అని స్పష్టం చేశారు. ఏఐ, ఇండస్ట్రీ 5.0 లాంటి టెక్నాలజీస్ తో వర్క్ కల్చర్ లో మార్పు వచ్చిందని, రాబోయే రోజుల్లో కంపెనీల కంటే 'ఎకో సిస్టం'కే ప్రాధాన్యత ఉంటుందన్నారు. అందుకే... భవిష్యత్తు కోసం ఎదురు చూడకుండా దానినే నిర్మించాలనే దృఢ సంకల్పంతో ముందుకు సాగుతున్నామన్నారు. పరిశ్రమలకు కేవలం అనుమతులు ఇచ్చే వ్యవస్థలా కాకుండా, వారితో కలిసి నడిచే భాగస్వామిగా ఉంటుందని, రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలను ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు, ప్రముఖ వైద్యులు డా.నాగేశ్వర్ రెడ్డి, ఫ్యాప్సీ ప్రెసిడెంట్ ఆర్.రవి కుమార్, స్కై రూట్ ఏరో స్పేస్ ప్రతినిధి పవన్, గ్రోత్ ఎక్స్ 2026 కన్వీనర్ పంకజ్ దివాన్ తదితరులు పాల్గొన్నారు.

# జీహెచ్ఎంసీను పాగా వేస్తాం

మొదటి తరువాయి

కౌన్సిలర్లతో కలిసి ఆలయానికి వచ్చినట్లు తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. భాగ్యలక్ష్మి ఆలయం ఎంతో పవర్‌ఫుల్ అని, భవిష్యత్తులో బీజేపీ అధికారంలోకి వస్తే పంజాబ్‌లోని స్వర్ణ దేవాలయం తరహాలో ఈ ఆలయాన్నీ గోడలెన్ టెంపుల్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. పాతబస్తీ హిందువులకు భాగ్యలక్ష్మి అమ్మవారు రక్షణగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. గతంలో ప్రజా సంగ్రామ యాత్రను భాగ్యలక్ష్మి అమ్మవారి ఆశీస్సులతో ప్రారంభించామని, కేసీఆర్ ప్రభుత్వ అడ్డంకులను
ఎదుర్కొని 1640 కిలోమీటర్ల పాదయాత్రను విజయవంతంగా పూర్తి చేశామని బండి సంజయ్ తెలిపారు. హైదరాబాద్‌లో హిందూ సమాజానికి ఏ




ఆపద వచ్చినా అడ్డుకునేందుకు బీజేపీ సిద్ధంగా ఉందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్ర విమర్శలు చేసిన బండి సంజయ్.. ఆలయాలపై దాడులు జరుగుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని ఆరోపించారు. సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయం, బంజారాహిల్స్ పెద్దమ్మ ఆలయం, శంషాబాద్ ఆలయాలపై దాడులు జరిగాయన్నారు. బాన్సువాడలో హిందువులపై రాళ్లదాడి జరిగినా బాధ్యులపై చర్యలు తీసుకోవడం లేదని, అమాయకులను అరెస్ట్ చేయడం సరికాదని కేంద్ర మంత్రి మండిపడ్డారు. పోలీసులు అక్రమ అరెస్టులను ఆపాలని హెచ్చరించారు. అవసరమైతే తానే బాన్సువాడకు వెళ్లి హిందువులకు రక్షణగా నిలుస్తానన్నారు. హైదరాబాద్ అభివృద్ధి కేంద్ర నిధులతోనే జరుగుతోందని, రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ఉద్యోగులకు బకాయిలు, మహిళలకు ఆర్థిక సాయం, నిరుద్యోగ భృతి వంటి హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# కాంగ్రెస్ అధికార దుర్వినియోగం

మొదటి తరువాయి

బీఆర్ఎస్ అభ్యర్థులను భయభ్రాంతులకు గురి చేసి కాంగ్రెస్ నాయకులు ఏడు మున్సిపల్ స్థానాల్లో గెలుపొంది అప్రజాస్వామికంగా 22 స్థానాలను దక్కించుకున్నారని విమర్శించారు. కొన్ని మున్సిపాలిటీల్లో ప్రజా తీర్పును అపహాస్యం చేసేలా వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంచిర్యాల జిల్లా క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ సంపూర్ణ ఆధిపత్యాన్ని ప్రదర్శించిందని తెలిపారు. సీఎం, స్థానిక మంత్రి సూచనలకు అనుగుణంగా అధికారగణం తొత్తులుగా మారి ప్రజా తీర్పును అపహాస్యం చేశారని ఆరోపించారు. మరికొన్ని మున్సిపాలిటీల్లోనూ ఇదే రీతిన వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా కౌన్సిలర్లపై అసభ్యంగా ప్రవర్తించినా కనీసం మంత్రి స్పందించలేదన్నారు. దేశ చరిత్రలో ఇంత ఘోరమైన రాజకీయం ఎన్నడూ లేదన్నారు. మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి పోలీసులను బూతులు తిట్టినా కేసు పెట్టలేదని గుర్తు చేశారు. బీజేపీ ఎంపీ అరవింద్ పోలీసులను నోటికొచ్చినట్టు తిట్టినా కేసులు పెట్టలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకుల అధికార దుర్వినియోగాన్ని అడ్డుకునే ప్రయత్నం చేసిన బీఆర్ఎస్ కార్యకర్తలపై కేసులు పెట్టడం ఇదెక్కడి



న్యాయమని ప్రశ్నించారు.

**ప్రలోభాలకు గురి చేసినా లొంగలేదు**

బీఆర్ఎస్ కౌన్సిలర్లకు కాంగ్రెస్ నాయకులు రూ.3 కోట్ల ఆఫర్ ఇచ్చినా తమ కౌన్సిలర్లు లొంగలేదని కేటీఆర్ అన్నారు. సీపీఐ కౌన్సిలర్లు నిబద్ధతతో పొత్తు ధర్మాన్ని పాటిస్తున్నారని తెలిపారు. బాల్క సుమన్‌ను జైలుపాలు చేశామని అనుకోవడం సరికాదని, ఆయనకు జైలు కొత్త కాదని అన్నారు. ఆరు నెలలు వివిధ సందర్భాల్లో జైలులో ఉన్నారని గుర్తు చేశారు. జైలులో పెడితే భయపడతారనుకుంటే పొరపాటేనని, రేవంత్‌రెడ్డి మళ్లీ చిప్పకూడు తినే సమయం వస్తుందని అన్నారు. పోలీసులను బూతులు తిడితే కేసులు పెట్టని డీజీపీ.. బీఆర్ఎస్ నాయకులపై మాత్రం కేసులు పెట్టి జైలుకు పంపుతున్నారని ఆరోపించారు. రాబోయే కాలంలో తిరిగి రాష్ట్రంలో గులాబీ జెండా ఎగురుతుందని, ఇప్పుడు చేస్తున్న అరాచకాలను మర్చిపోమని అన్నారు. రాజ్యాంగాన్ని, చట్టాలను తుంగలో తొక్కుతున్న వారిని వదలమని, క్యాతన్‌పల్లి, ఇబ్రహీంపట్నం, ఖానాపూర్‌లో వెంటనే చైర్మెన్, వైస్‌చైర్మెన్ ఎన్నిక నిర్వహించాలని డిమాండ్ చేశారు. నిజాయితీగా ఎన్నిక జరిగే విధంగా చూడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందన్నారు. అధికారుల ముసుగులో అధికార పార్టీకి వత్తాసు పలికే వారిని వదలమని, క్యాతన్‌పల్లిలో మహిళా కౌన్సిలర్లపై అసభ్యంగా వ్యవహరించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మిపై సైతం కేసు పెట్టారని, ప్రజాస్వామ్యాన్ని అగౌరవపరుస్తున్న కాంగ్రెస్ నాయకులకు ప్రజలు బుద్ధిచెప్పే రోజు వస్తుందని అన్నారు.

# ఇంటర్మీడియట్ పరీక్షల హాల్ సమస్యలపై వినతిపత్రం



**దేవరకొండ, ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఫిబ్రవరి 25 నుండి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ పరీక్షల సందర్భంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) దేవరకొండ శాఖ ఆధ్వర్యంలో ఆర్డీఓకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కో-కన్వీనర్ యలమల గోపీచంద్ మాట్లాడుతూ, "పరీక్ష గదుల్లో విద్యుత్ లైట్లు, ఫ్యాన్లు, మంచినీటి వసతి లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పరీక్షల సమయంలో ఈ సౌకర్యాలు కల్పించాలి" అని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నగర జాయింట్ సెక్రటరీ శివరామరాజు, యలమల హేమసుందర్, రాకేష్, సాయి, శివ, వంశీ తదితరులు పాల్గొన్నారు.

# 108 కలశాలతో కోటి తలంబ్రాల దీక్ష కరపత్రాల ఆవిష్కరణ



**కొండపాక, ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
భక్త మార్కండేయ దేవాలయం ఆధ్వర్యంలో భద్రాచలం సీతారాముల కల్యాణానికి కోటి తలంబ్రాలు అందించేందుకు సిద్ధమవుతున్న కొండపాక గ్రామంలో మంగళవారం కరపత్రాల ఆవిష్కరణ జరిగింది. భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత, శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజు మాట్లాడుతూ, "ఫిబ్రవరి 26న 108 కలశాలతో భద్రాచలం నుండి వచ్చే తలంబ్రాలను భక్తితో స్వాగతించి అందజేస్తాం. ఈ పుణ్యక్రతువులో పాల్గొని భగవంతుని కృపకు పాత్రులు కావాలి" అని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మార్కండేయ దేవాలయం కమిటీ అధ్యక్షుడు మంతెన నాగరాజ, సభ్యులు ఆనంద్, భరత్, యాదగిరి, రఘు, నవీన్, చంద్రమౌళి, రవీందర్, వెంకటేశం, బాలయ్య, శ్రీహరి, ప్రసాద్, రాకేష్, విజయ్, చరణ్, నాగరాజు, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యసభ ఎంపీ కృష్ణయ్యకు బీజేపీ నాయకుల ఘన స్వాగతం



**ఆమనగల్లు, ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామానికి వెళ్తున్న రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్యకు ఆమనగల్లు మున్సిపాలిటీలో ఘన స్వాగతం లభించింది. మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్టీ సీనియర్ నాయకులు, కౌన్సిలర్లు ఎర్రవోలు మహేష్, ముక్తాల వెంకటయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ రాంపాల్ నాయక్, మాజీ కౌన్సిలర్లు శ్రీకాంత్ సింగ్, చెక్కల లక్ష్మణ్, చెన్నకేశవులు, బీజేవైఎం కో-కన్వీనర్ రవి రాథోడ్, బొల్లు మహేందర్, పద్మ ప్రశాంత్, విష్ణు చారి, చెక్కల సాయి తదితరులు పాల్గొన్నారు.

## బాయ్‌ఫ్రెండ్ ఎదుటే యువతిపై గ్యాంగ్‌రేప్

**గువహటి, ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బీజేపీ పాలిత అస్సాంలో దారుణం చోటుచేసుకుంది. బాయ్‌ఫ్రెండ్‌తో బయటకు వెళ్లిన 28 ఏండ్ల యువతిపై కొంతమంది సామూహిక లైంగికదాడికి పాల్పడ్డారు. బాధితురాలిని బెదిరించిన రేపిస్ట్‌లు.. బాయ్‌ఫ్రెండ్ ముందే ఘాతుకానికి పాల్పడ్డారు. ఘటన తర్వాత బాయ్‌ఫ్రెండ్ నుంచి రూ.10 వేలు వసూలు చేశారు. ఫిబ్రవరి 19న చోటుచేసుకున్న ఈ ఘటనపై బాధితురాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీని ప్రకారం.. సిల్చార్ టౌన్‌కు కొన్ని కిలోమీటర్ల దూరంలో ఓ బైపాస్ రోడ్డు వద్ద కారులో బాయ్‌ఫ్రెండ్‌తో ఉండగా బాధితురాలిపై 8 మందితో కూడిన గుంపు దాడికి దిగింది. ఈ ఘటనపై సర్వత్రా ఆగ్రహం వెల్లువెత్తింది.

# చిన్నారి మృతికి కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలి

-- వార్డు సభ్యురాలు ముంజంపల్లి కవిత రాకేష్



**ఎలిగేడు, ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మర జాతరలో రజక కుటుంబంపై జరిగిన దాడిలో రెండేళ్ల చిన్నారి మృతి చెందడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ బాధ్యులను కఠినంగా శిక్షించాలని ఎలిగేడు గ్రామపంచాయతీ వార్డు సభ్యురాలు ముంజంపల్లి కవిత రాకేష్, రజక సంఘ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఎలిగేడు మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ, "అగ్రకులానికి చెందిన కొందరు వ్యక్తులు మానవత్వం మరిచి దేవాలయంలోకి రానివ్వకుండా కులం పేరుతో దూషిస్తూ దాడి చేసి చిన్నారిని హత్య చేయడం అమానుషం. ఈ ఘటన రజాకార్ల కాలంనాటి పరిస్థితులను గుర్తు చేస్తోంది" అని ఖండించారు. రాష్ట్రంలో ఎస్సీ, బీసీ, ఎస్టీ వర్గాలపై దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తూ, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. రజకులకు అట్రాసిటీ చట్టం వంటి ప్రత్యేక రక్షణ కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రజక సంఘ నాయకులు రాకేష్, మల్లేష్, అనిల్, నాగరాజు, ఓదెలు, వెంకటేష్, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

## నేడు మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు



**ఎలిగేడు, ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పెద్దపల్లి మాజీ శాసనసభ్యులు, ట్రినిటీ విద్యాసంస్థల అధినేత దాసరి మనోహర్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు బుధవారం ఉదయం 10 గంటలకు ఎలిగేడు మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఘనంగా నిర్వహించనున్నట్లు మాజీ ఎంపీపీ తానిపర్తి స్రవంతి మోహన్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి" అని కోరారు.

# ఈశాల తక్కల్లపల్లి చెరువులో మత్స్య సంపద



**పాలకుర్తి, ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పాలకుర్తి మండలం ఈశాల తక్కల్లపల్లి గ్రామ పెద్ద చెరువులో ఈ ఏడాది మత్స్య సంపద సమృద్ధిగా ఉందని ముదిరాజ్ కులస్తులు తెలిపారు. మంగళవారం పడవలు, వలల సహాయంతో చేపలు పట్టించగా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తండోపతండాలుగా వచ్చి కొనుగోలు చేశారు. ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో రెండు సంవత్సరాల క్రితం ఆంధ్రప్రదేశ్ కైకలూరు నుండి మూడు లక్షల చేప పిల్లలను కొనుగోలు చేసి చెరువులో వదిలినట్లు, ప్రస్తుతం అవి ఐదు కిలోల బరువుకు పెరిగాయని తెలిపారు. ఇక్కడి చేపలు ఆరోగ్యంగా ఉండి రుచిగా ఉండటంతో కలకత్తా, బాంబే వంటి రాష్ట్రాలకు కూడా ఎగుమతి చేస్తారని పేర్కొన్నారు. వేసవి కాలంలో చెరువులో నీరు తగ్గే అవకాశం ఉండటంతో ముందస్తు జాగ్రత్తగా చేపలు పట్టించి విక్రయిస్తున్నామని మత్స్యకారులు తెలిపారు.

# న్యాయవాదుల రక్షణ చట్టం అంశాన్ని సీఎం దృష్టికి తీసుకుపోతా

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**ఆమనగల్లు, ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
న్యాయవాదుల రక్షణ చట్టం రూపకల్పన విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకుపోతానని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశాన్ని ప్రస్తావిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అండేకార్ యాదిలాల్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలసి, రాష్ట్రంలో న్యాయవాదులపై పెరుగుతున్న దాడులు, హత్యలపై ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయవాదుల రక్షణ చట్టాన్ని రూపొందించి అమలు చేయాలని కోరారు. అదేవిధంగా ఆమనగల్లు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నిర్మాణానికి ఐదు ఎకరాల స్థలం కేటాయించాలని వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే నారాయణరెడ్డి, అనువైన ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించి కేటాయింపు పూర్తి కాగానే భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు "న్యాయవాదులు ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించాలి. సమాజసేవ, ప్రజా చైతన్య కార్యక్రమాల్లో ముందుండాలి" అని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది లక్ష్మణ శర్మ, న్యాయవాదులు గణేష్, రామకృష్ణ, విజయ్‌కుమార్, శిరీష్, శేఖర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# వార్డు అభివృద్ధే లక్ష్యం


- కౌన్సిలర్ చేగూరి లక్ష్మీ ప్రసన్న వేణుగోపాల్



**షాద్‌నగర్, ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
28వ వార్డు అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని కౌన్సిలర్ చేగూరి లక్ష్మీ ప్రసన్న వేణుగోపాల్ అన్నారు. వార్డులో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్న ఆయన మాట్లాడుతూ, "ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకుంటాను. ఎక్కడైనా సమస్య ఉంటే నేరుగా నా దృష్టికి తీసుకురావాలి. వార్డు అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలి" అని సూచించారు. కార్యక్రమంలో కాలనీ వాసులు రమేష్, శ్రీశైలం గౌడ్ (లడ్డు), కోటిలింగం గౌడ్, గొంగల రవికుమార్, అభిలాష్, రాహుల్, శ్రీకాంత్, శ్రీచరణ్, చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# పల్లె ప్రగతిలో సర్పంచుల పాత్ర కీలకం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్





**ముచ్చింతల్, ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా నూతన సర్పంచుల శిక్షణ కార్యక్రమం ముచ్చింతల్ గ్రామ పరిధిలోని స్వర్ణ భారత్ ట్రస్టులో జరిగింది. ఈ కార్యక్రమానికి షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "గ్రామాల్లో అభివృద్ధి, సహృద్భావ వాతావరణం సాధించడంలో సర్పంచుల పాత్ర అత్యంత కీలకం. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సేవ చేస్తే మంచి పేరు వస్తుంది" అని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్, డివిజనల్ పంచాయతీ అధికారి సాధన, మండల పంచాయతీ అధికారి కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి ఆమనగల్లు నాయకుల ఘన స్వాగతం



**ఆమనగల్లు, ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామానికి వెళ్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామ్‌చందర్‌రావుకు ఆమనగల్లు మున్సిపాలిటీలో ఘన స్వాగతం లభించింది. మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా నాయకులు రాష్ట్ర అధ్యక్షుడికి పూలమాలలు వేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఎర్రవోలు మహేష్, విక్రం రెడ్డి, చెక్కల లక్ష్మణ్, కాసుల వెంకటేష్, సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



**ఆమనగల్లు, ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్లు మండలంలోని కోనాపూర్ గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి పాండు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయురాలు విజేత బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఒక్కరోజు ఉపాధ్యాయులుగా వ్యవహరించడం ద్వారా వారు ఆనందాన్ని తల్లిదండ్రులతో, సహచరులతో పంచుకున్నారు. కార్యక్రమంలో డీఈవో ధనుష్, ఎంఈఓ విష్ణు, ఏఎంఓ సింధు, హెడ్‌మాస్టర్ సింధు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ శోభారాణి, ఉపాధ్యాయులు స్వాతి, పద్మ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# సీనియర్ మహిళా నేతలకు రాష్ట్రస్థాయి పదవులు ఇవ్వాలని డిమాండ్

**కరీంనగర్, ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కరీంనగర్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్య ప్రసన్నారెడ్డి ఆధ్వర్యంలో డిసిసి కార్యాలయంలో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బూత్ స్థాయి నుండి మహిళా కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలని, రాబోయే జెడ్పిటిసి, ఎంపీటిసి ఎన్నికల్లో పార్టీ విజయానికి మహిళా కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. గత 10 ఏళ్ల టిఆర్ఎస్ పాలనలో ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడ్డ సీనియర్ మహిళా నేతలకు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలని సమావేశంలో మహిళా నాయకులు డిమాండ్ చేశారు. కర్ర సత్య ప్రసన్నారెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడంలో దశాబ్దాలుగా కృషి చేసిన మహిళా నాయకులకు సముచిత ప్రాధాన్యం ఇవ్వాలని, నామినేటెడ్ పోస్టుల భర్తీలో కూడా మహిళలకు అవకాశాలు కల్పించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ గాజుల సుకన్య, జనరల్ సెక్రటరీ జ్యోతి రెడ్డి, నగర అధ్యక్షురాలు వెన్నం రజిత రెడ్డి, జిల్లా మహిళా బ్లాక్, మండల, పట్టణ అధ్యక్షులు, కార్పొరేషన్ డివిజన్ మహిళా అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడికి రక్తదానం



**కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

జగిత్యాల జిల్లా యువకుడు సుమంత్ ప్రసాద్ (23) రోడ్డు ప్రమాదంలో గాయపడి కరీంనగర్‌లోని లక్ష్మీనరసింహ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆపరేషన్ కోసం అత్యవసరంగా ఏబీం రక్తం అవసరమైన సమయంలో, ఎలాబోతారం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు బుచ్చాల కొమురయ్య తన బీం రక్తాన్ని మూడోసారి దానం చేశారు. ఈ సందర్భంగా సోషల్ ఆక్టివిస్ట్ గాలిపెల్లి కుమార్, మొగ్దుంపూర్ 8వ వార్డు సభ్యుడు వడ్లూరి అశోక్ పాల్గొని కొమురయ్యను అభినందించారు. గత మూడు సంవత్సరాలుగా అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం చేసి విలువైన ప్రాణాలను కాపాడుతున్నందుకు సంతోషం వ్యక్తం చేసిన కొమురయ్య, ప్రతి ఒక్కరూ తమ పుట్టినరోజులు, పెళ్లిరోజులు, శుభకార్యాల సందర్భాల్లో రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు.

# పేద విద్యార్థులపై చిన్నచూపు ఎప్పటివరకు?





రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గురుకుల పాఠశాలలు, ప్రభుత్వ వసతి గృహాల్లో నివసిస్తున్న పేద మరియు మధ్యతరగతి విద్యార్థుల పరిస్థితి దయనీయంగా మారింది. పల్లెల నుంచి ఆశలతో, అభిలాషలతో వచ్చిన ఈ విద్యార్థులు మెరుగైన విద్య సాధించి జీవితంలో ఎదగాలని కలలు కంటుంటే, వాస్తవ పరిస్థితులు మాత్రం ప్రాణభయంతో బిక్కుబిక్కుమంటూ జీవించేలా చేస్తున్నాయి. శిథిలావస్థకు చేరిన భవనాలు, అద్దె ఇళ్లలో నడుస్తున్న హాస్టళ్లు, కనీస సౌకర్యాల లేమి --- ఇవన్నీ కలిసి వారి భవిష్యత్తుపై నీడలా కమ్ముకున్నాయి. రాష్ట్రం ఏర్పడి దాదాపు పన్నెండు సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ అనేక వసతి గృహాలు అద్దె భవనాల్లోనే కొనసాగడం ఆందోళనకరం. చిన్నచిన్న గదుల్లో పరిమితికి మించి విద్యార్థులు కిక్కిరిసిపోవాల్సి వస్తోంది. కొన్ని సందర్భాల్లో అద్దె బకాయిల కారణంగా యజమానులు తాళాలు వేసిన దాఖలాలు కూడా ఉన్నాయి. రక్షణ వ్యవస్థ పూర్తిగా లేనట్టే ఉంది. వాచ్మెన్‌లు లేకపోవడం వల్ల హాస్టల్లోకి ఎవరు వస్తున్నారు, ఎవరు వెళ్తున్నారు అన్నది చూసే వారు లేరు. సరిపడా మరుగుదొడ్లు లేకపోవడం, ఉన్నవాటికి శుభ్రత లేకపోవడం, గదుల్లో సరైన వెలుతురు, గాలి, ఫ్యాన్ వంటి మౌలిక సదుపాయాల లేమి విద్యార్థుల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెడుతోంది. సంవత్సరానికి నిర్వహించాల్సిన వైద్య శిబిరాలు నిర్వహించడంలేదు. చదువుకు అత్యవసరమైన లైబ్రరీలు చాలా చోట్ల లేవు; ఉన్నచోట్ల పుస్తకాలే లేవు. ఈ నిర్లక్ష్యం విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి తీవ్ర ఆటంకంగా మారుతోంది. ముఖ్యంగా ఆహార నాణ్యత విషయంలో పరిస్థితి మరింత భయానకంగా ఉంది. అనారోగ్యకరమైన ఆహారం, కుళ్లిన కూరగాయలు, గడువు ముగిసిన సరుకుల వినియోగం కారణంగా తరచూ ఫుడ్ పాయిజన్ ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. 2025లో విడుదలైన జాతీయ మానవ హక్కుల కమిషన్ నివేదిక ప్రకారం తెలంగాణ గురుకుల పాఠశాలల్లో ఫుడ్ పాయిజన్ కారణంగా పలువురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయినట్టు, వందలాది మంది అస్వస్థతకు గురైనట్టు వెల్లడైంది. ఇటీవల మెదక్, రామాయంపేట, మంచిర్యాల, ఖమ్మం, వనపర్తి, సంగారెడ్డి జిల్లాల్లో జరిగిన ఘటనలు పరిస్థితి ఎంత తీవ్రమో తెలియజేస్తున్నాయి. ఆసుపత్రుల పాలైన విద్యార్థులలో కొందరు ప్రాణాలు కోల్పోవడం మరింత విషాదకరం. డిసెంబర్ 14, 2024న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సహా ప్రజాప్రతినిధులు "కామన్ డైట్ మెనూ" పేరుతో గురుకులాలను సందర్శించి విద్యార్థులతో కలిసి భోజనం చేస్తూ సంస్కరణలు చేపడతామని ప్రకటించారు. అయితే ఆ సందర్శనలు ముగిసిన వెంటనే పాత విధానాలే కొనసాగడం బాధాకరం. ప్రకటించిన కామన్ డైట్ మెనూ ఇప్పటికీ అమలులోకి రాకపోవడం విద్యార్థులపై జరుగుతున్న నిర్లక్ష్యానికి నిదర్శనం. పేద విద్యార్థుల భవిష్యత్తు రాష్ట్ర భవిష్యత్తే అన్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలి. కనీస మౌలిక సదుపాయాలు, భద్రత, పరిశుభ్రమైన నీరు, నాణ్యమైన ఆహారం, వైద్య సేవలు, చదువు వాతావరణం --- ఇవన్నీ ప్రతి వసతి గృహంలో తప్పనిసరిగా ఉండాలి. రాష్ట్రవ్యాప్తంగా కామన్ డైట్ మెనూను తక్షణమే అమలు చేసి, ఆహార నాణ్యతపై కఠిన పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ఫుడ్ పాయిజన్ వంటి ఘటనలు పునరావృతం కాకుండా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. పేద విద్యార్థులపై చిన్నచూపు మానుకుని వారి భద్రత, ఆరోగ్యం, విద్యా హక్కులను కాపాడటం ప్రభుత్వానికి అత్యవసర బాధ్యత. వారి కన్నీళ్లు ఆగినప్పుడే సమాజం నిజంగా అభివృద్ధి చెందిందని చెప్పగలం.

**--- హరీష్ సాగర్**
**స్టేట్ కన్వీనర్, అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ సాందీపని మాసపత్రిక**
**6302758830**

# పసి బిడ్డను హత్య చేసిన అగ్రకుల దురహంకారులను కఠినంగా శిక్షించాలి

**-విద్వేషాలు రెచ్చగొట్టే మతోన్మాదులకు పసిబిడ్డ హత్య కనపడట్లేదా?**
**-నల్గొండ సుభాష్ విగ్రహం వద్ద వద్ద కేవిపిఎస్, వృత్తి సంఘాల నిరసన**



**నల్లగొండ, ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో రెండు నెలల పసిబిడ్డను అత్యంత క్రూరంగా అమానవీయంగా కాలితో తన్ని హత్య చేసిన ఆగ్రామ అగ్రకుల పెత్తందారులను కఠినంగా శిక్షించాలని, ఎస్సీ ఎస్టీ అత్యాచార నిరోధక చట్టంతోపాటు హత్యానేరం క్రింద కేసు నమోదు చేసి తక్షణమే రిమాండ్ చేయాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున చేతి వృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ గంజి మురళీధర్ రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సుభాష్ విగ్రహం వద్ద కేవిపిఎస్ వృత్తిదారుల సంఘంఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, పోలీసుల నిర్లక్ష్య వైఖరి నశించాలి అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు అనంతరం కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున చేతి వృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ గంజి మురళీధర్ మాట్లాడుతూ నాగర్ కర్నూల్ జిల్లాలో కుల వివక్ష అగ్రకుల దురహంకారానికి రెండు నెలల పసిబిడ్డ హత్యగావించబడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కుమ్మెర గ్రామములో మల్లయ్య జాతరలో అట్టడుగు తరగతులకు ప్రవేశాన్ని అడ్డుకొని వివక్ష పాటించడమే కాకుండా మహిళలని చూడకుండా నానా బూతులు తిట్టి అవమానించారని చెప్పారు. ఇదేమిటని సోషల్ మీడియాలో ప్రశ్నించిన గణేష్ అనే రజక యువకుడిని మూడున్నర గంటల పాటు ఆ గ్రామ అగ్రకుల పెత్తందారులు ఒక గదిలో నిర్బంధించి చితకబాదారని చెప్పారు తన భర్తను కొట్టొద్దని కాళ్ళ మీద పడి మౌనిక బతిమిలాడి వేడుకున్న కాళ్లతో తన్నారే కానీ కనీసం కనికరించలేదని చెప్పారు. 8 మంది అగ్రకుల దురహంకారులు కాళ్లతో తొక్కి పసిబిడ్డను పొట్టన పెట్టుకున్నారని అత్యంత అమానవీయ క్రూరమైన చర్యకు పాల్పడ్డారని చెప్పారు. ఈ ఘటనపై పోలీసుల ప్రేక్షక పాత్ర హంతకులను రక్షించే విధంగా ఉందన్నారు బాధితులకు చట్టబద్ధంగా న్యాయం చేయాల్సిన పోలీసులు బాధితుల పైన అక్రమ కేసులు పెట్టారని నిందితులు ఎనిమిది మంది కాగా కేవలం నలుగురిని మాత్రమే అరెస్ట్ చేశారని మొత్తం హంతకులందరిని తక్షణమే అరెస్టు చేసి రిమాండ్ కు పంపాలని డిమాండ్ చేశారు హత్య జరిగితే అటేమ్ టు మర్డర్ కేసు పెట్టడం అన్యాయమైన చర్య అన్నారు పసిబిడ్డ హత్య జరిగింది కాబట్టి హత్యా నేరం కింద కేసు నమోదు చేయాలని 103 సెక్షన్ పెట్టాలని డిమాండ్ చేశారు. ఇంత పెద్ద ఘటన జరిగితే జిల్లా కలెక్టర్ ఎస్పీ ఎస్సీ ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం ప్రకారం ఆ గ్రామాన్ని సందర్శించాలని ఉన్నప్పటికీ ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే ఎమ్మెల్సీ లకు హంతకులైన శ్రీనివాస్ రెడ్డి మరికొందరు దగ్గర బంధువులు కావడం వల్ల పోలీసులు కేసును నిర్లక్ష్యం చేయడం జరుగుతుందన్నారు. ఎంపీ మల్లు రవి ఈ ఘటనపై ఆ కుటుంబాన్ని ఎందుకు పరామర్శించడం లేదని విమర్శించారు. మేడారం సమ్మక్క సారలమ్మ జాతరలో కోవాబన్ అమ్ముకునే అమాయక పేదవాడి పై మత విద్వేషం చిమ్మిన మతోన్మాదులు పసిబిడ్డ హత్య వారి కంటికి కనిపించడం లేదా? అని ప్రశ్నించారు మత కొట్లాటలు పెట్టడం తప్ప మానవీయతను గుర్తించలేరని విమర్శించారు అగ్రకుల హిందువులు నిమ్న కుల హిందువులను చంపితే ఆర్ఎస్ఎస్ బిజెపి మతోన్మాదుల విధానం చంపిన హంతకుల పక్షమేనని వారి చర్య రుజువు చేసిందన్నారు. సీఎం స్వంత జిల్లాలో ఈ దారుణం జరిగితే సీఎం ఎందుకు స్పందించడం లేదని విమర్శించారు తక్షణమే హంతకులందరినీ అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఎం విఎం ట్రస్ట్ భవన్ కార్యదర్శి పుచ్చకాయల .నర్సిరెడ్డి, కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి బొల్లు రవీందర్ కుమార్ ,రమేష్, నాగయ్య ,రవి ,ఆంజనేయులు, సాయి ,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# చేనేత రుణమాఫీ హామీ అమలు చేయాలి

**నల్లగొండ ,ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** చేనేత కార్మికులకు ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ పూర్తిగా అమలు చేయాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు మంగళవారం దొడ్డి కొమరయ్య భవన్ లో జరిగిన విలేకరుల సమావేశంలో తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చేనేత కార్మికులకు రుణమాఫీ చేస్తానని స్వయంగా ప్రకటించి 20 నెలలు గడిచిన పూర్తిగా చేనేత కార్మికుల రుణమాఫీ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నవంబర్ లో రాష్ట్ర కమిషనర్ కార్యాలయం ముందు ధర్నా చేసిన సందర్భంలో వారం రోజుల్లో మాఫీ చేస్తామని హామీ ఇచ్చి నేటికీ రుణమాఫీ జరగలేదని అన్నారు. మున్సిపల్ ఎన్నికల కోసం పట్టణ ప్రాంతాల్లో కొంతమందికి నామమాత్రంగా మాఫీ చేసి చేతులు దులుపుకున్నారని అన్నారు. నేతన్న పొదుపు పథకం ద్వారా చేనేత కార్మికులు చేసుకున్న పొదుపుకు రెండింతలు ప్రభుత్వం ఖాతాలో జమ చేయాల్సి ఉన్న సంవత్సరం గడిచిన నిధులు విడుదల చేసి కార్మికుల ఖాతాలలో నేటికి జమ చేయలేదని అన్నారు. జియో టాక్ ఉన్న చేనేత



కార్మికులందరికీ ఎలాంటి షరతులు లేకుండా చేనేత భరోసా పథకం అమలు చేయాలని మరణించిన చేనేత కార్మికులకు ఇస్తున్న నేతన్న భీమా పెండింగ్ లో ఉన్న అన్ని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మికులకు ఐదు లక్షల వరకు ఆరోగ్య భీమా సదుపాయం కల్పించాలని చేనేత వస్త్రాలకు డూప్లికేట్ ప్రింటింగ్ వస్త్రాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ అవసరాలకు చేనేత బట్టలను కొనుగోలు చేయాలని రేషన్ షాపుల ద్వారా చేనేత చీర, దొతి అందించాలని, పెట్టుబడి సహాయం కింద జీరో వడ్డీతో కొత్త రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పవర్లూమ్ కార్మికుల పొదుపు పథకం నిలిపివేసి 9 నెలలు గడిచిందని వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. చేనేత పవర్ లూమ్ కార్మికుల సమస్యలు పరిష్కరించని యెడల త్వరలో రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్ ముందు ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

ఈ విలేకరుల సమావేశంలో తెలంగాణ పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గంజి నాగరాజు, దండెంపల్లి సత్తయ్య ,చేనేత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రాపోలు వెంకన్న, పట్టణ అధ్యక్షులు వాలుగొండ మధు, జిల్లా నాయకులు ఏలే శ్రీనివాస్ ,లక్ష్మీనారాయణ, వాలిగొండ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారులకు హైకోర్టు గుర్తింపు



**అమ్రాబాద్, ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులను లిఫ్రీడమ్ ఫైటర్స్‌లిగా గుర్తించాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి ఉత్తర్వులు జారీ చేసింది. 2003లో తెలంగాణ పల్లె బాట కార్యక్రమం నుంచి 2014లో పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టే వరకు జరిగిన మలిదశ ఉద్యమంలో అనేక మంది కేసులు ఎదుర్కొని, జైలు పాలై, ధర్నాలు, రాస్తారోకాలు చేసిన ఉద్యమకారులు గుర్తింపు కోసం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఫిబ్రవరి 23న జస్టిస్ విజయసేనారెడ్డి వాదనలు విని, ఉద్యమకారులను అభయహస్తం కింద ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించారు. ఈనెల 20న రాష్ట్ర ప్రభుత్వం సబ్ కమిటీ ఏర్పాటు చేస్తుందని మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. ఈ సందర్భంగా తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర నేత శ్రీనివాస్ మాట్లాడుతూ, ఉద్యమకారులకు గుర్తింపు లభించడం చారిత్రాత్మకమని, హైకోర్టు తీర్పు, ప్రభుత్వ నిర్ణయానికి కృతజ్ఞతలు తెలిపారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు

**- ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు**



**పెద్దపల్లి, ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** : పెద్దపల్లి పట్టణంలోని అమర్చంద్ కళ్యాణ మండపంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో పెద్దపల్లి మున్సిపల్, మండలానికి చెందిన 213 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. మొత్తం రూ. 2,13,49,737 విలువ గల చెక్కులను పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణారావు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో పెద్దపల్లిని అన్ని విధాల అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. త్వరలోనే బస్సు డిపో, బైపాస్ రోడ్డు, సర్కార్ దవాఖాన వంటి అభివృద్ధి పనులు పూర్తవుతాయని పేర్కొన్నారు. తమ పాలనలో అవినీతికి తావు లేకుండా నీతివంతమైన పాలన అందిస్తున్నామని, ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రైతులకు రూ. 2 లక్షల వరకు రుణమాఫీ, రైతుభరోసా నిధులు 9 రోజుల్లోనే ఖాతాల్లో జమ చేసినట్లు వివరించారు. ఆరోగ్యశ్రీ ద్వారా రూ. 10 లక్షల వరకు ఉచిత వైద్యాన్ని అందిస్తున్నామని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నూగ్గిళ్ల మల్లయ్య, వైస్ చైర్మన్ ముస్కాన్ నాజ్, మార్కెట్ చైర్మన్ మల్లారెడ్డి, తాసిల్దార్ రాజయ్యతో పాటు పలువురు కౌన్సిలర్లు, సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

# పసి బిడ్డ మరణంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్



**వంగూరు, ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** వంగూరు మండల కేంద్రంలో జరిగిన మీడియా సమావేశంలో కేవైసీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొత్తూరు చంద్రమౌళి మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర మల్లన్న జాతరలో కుల వివక్షతో జరిగిన దాడిలో పసి బిడ్డ మరణించడం అమానుషమని తీవ్రంగా ఖండించారు. రజక కుటుంబానికి చెందిన గణేశ్, మౌనికపై దాడి చేసి, వారి రెండు నెలల పాప ప్రాణాలు కోల్పోవడం అత్యంత విచారకరమని పేర్కొన్నారు. ఈ ఘటనకు కారణమైన వారిపై హత్యా నేరం కేసు, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి తక్షణం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం పరంగా ఆదుకోవాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి మనోధైర్యం కల్పించాలని కోరారు.

# గాయత్రి విద్యానికేతన్ ఆనందోత్సవ్-2026






**పెద్దపల్లి, ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** పెద్దపల్లి గాయత్రి విద్యానికేతన్ హై స్కూల్ ఆధ్వర్యంలో ఆనందోత్సవ్-2026 కార్యక్రమం స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో ఘనంగా జరిగింది. కార్యక్రమాన్ని విద్యాసంస్థల అధినేత అల్లంకి శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలనం చేసి ప్రారంభించారు. విద్యార్థుల అద్భుత నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. సుమారు 4000 మంది తల్లిదండ్రులు, విద్యార్థులు, స్థానికులు హాజరై పిల్లలను ఆశీర్వదించారు. చైర్మన్ అల్లంకి శ్రీనివాస్ మాట్లాడుతూ గాయత్రి విద్యానికేతన్ 19వ సంవత్సరంలోకి అడుగుపెడుతోందని, ఇది పోషకులు, శ్రేయోభిలాషుల సహకారంతో సాధ్యమైందని కృతజ్ఞతలు తెలిపారు. కరెస్పాండెంట్ రజనీ దేవి విద్యార్థులు సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలని, కృషి చేస్తే ఏదైనా సాధించవచ్చని ప్రేరణాత్మక సందేశం అందించారు. ప్రదర్శనల్లో 9వ తరగతి విద్యార్థుల స్వాగత గీతం, 8వ తరగతి విద్యార్థుల కాళీమాత నృత్యం, రైతుల కష్టాలను ప్రతిబింబించే నృత్యరూపకం, ఆపరేషన్ సింధూర్ అంశంపై రూపొందించిన నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ముఖ్యంగా ప్రాథమిక విభాగం విద్యార్థుల తల్లులు కూడా నృత్యంలో పాల్గొనడం విశేషంగా నిలిచింది. తల్లిదండ్రులు తమ పిల్లలు గాయత్రి విద్యానికేతన్‌లో చేరిన తర్వాత విద్యా ప్రగతి, వ్యక్తిత్వ వికాసం ఎలా అభివృద్ధి చెందిందో వివరించడం అందరినీ ప్రేరేపించింది. ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు సమిష్టిగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఎస్సీ సెల్ అధ్యక్షుడికి ఘన సన్మానం



**పదర, ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పదర మండలం రాయలగండి శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి జాతరలో కమిటీ సభ్యులు, నిర్వాహకులు కలిసి ఎస్సీ సెల్ తాలూకా అధ్యక్షుడు చింతల రాజగోపాల్‌ను మర్యాదపూర్వకంగా కలసి ఘనంగా సన్మానించారు.

# 'నాన్-షెడ్యూల్డ్' విమాన ఆపరేటర్లకు నిబంధనలు కఠినతరం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** వరుస విమాన దుర్ఘటనల నేపథ్యంలో 'నాన్ షెడ్యూల్డ్' విమాన ఆపరేటర్లకు నిబంధనలను కఠినతరం చేస్తున్నట్టు డీజీసీఏ ప్రకటించింది. విమానంలో భద్రతాపరమైన లోపాలకు పైలట్లపై నిందమోపితే కుదరదని, నిబంధనలు పాటించని నాన్-షెడ్యూల్డ్ ఆపరేటర్లు, వాటి మేనేజర్లపై వ్యక్తిగత చర్యలు తప్పవని హెచ్చరించింది. ఈ రంగంలోని ఆపరేటర్లతో డీజీసీఏ మంగళవారం సమావేశం నిర్వహించింది. జనవరి 28న బారామతిలో, సోమవారం



జార్ఖండ్‌లో విమాన దుర్ఘటనలు.. రెండూ 'నాన్-షెడ్యూల్డ్ ఆపరేటర్' విమానాలే కావటంపై డీజీసీఏ చర్యలకు దిగింది. ఇతర ప్రమాణాలన్నింటి కంటే భద్రతే అత్యంత ముఖ్యమైందని ఆపరేటర్లకు తెలియజేసింది.

## నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ కార్పొరేటర్లతో కలెక్టర్, సీపీని కలిసిన రాజేందర్ రావు



**కరీంనగర్, ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఇటీవల నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు, కాంటెస్టెడ్ అభ్యర్థులతో కలిసి కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలంను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్, సీపీకి పూల మొక్కలను అందజేశారు. అనంతరం పలు అంశాలపై చర్చించిన రాజేందర్ రావు, కరీంనగర్ జిల్లాకు ప్రత్యేక గుర్తింపు వస్తోందని, ఇంకా మరింత అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉందని సూచించారు. జిల్లాలో శాంతిభద్రతలు బాగా ఉన్నాయని, దీనికి సీపీ గౌష్ ఆలం కృషి ఎంతో ఉందని ఆయన ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు, కాంటెస్టెడ్ అభ్యర్థులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాలి

-- సీఎస్ కె. రామకృష్ణ రావు




**కరీంనగర్, ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు జరగనున్న ఇంటర్ థియరీ పరీక్షలను రాష్ట్రవ్యాప్తంగా కట్టుదిట్టంగా నిర్వహించాలని సీఎస్ కె. రామకృష్ణ రావు సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం ఆయన అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కరీంనగర్ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం పాల్గొన్నారు.సీఎస్ మాట్లాడుతూ పరీక్షా కేంద్రాలకు 5 నిమిషాలు ఆలస్యమైనా విద్యార్థులను అనుమతించాలని, ప్రశ్నాపత్రాలు సీసీ కెమెరాల సమక్షంలోనే ఓపెన్ చేయాలని, సెల్‌ఫోన్లను అనుమతించరాదని స్పష్టం చేశారు.పరీక్షా కేంద్రాల్లో నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీరు, వైద్య సిబ్బంది, పారిశుద్ధ్య నిర్వహణ వంటి అన్ని వసతులు కల్పించాలని సూచించారు. విద్యార్థుల సౌకర్యార్థం పరీక్షా రూట్లలో ఆర్టీసీ స్పెషల్ బస్సులు నడపాలని, ప్రతి కేంద్రంలో పారా మెడికల్ సిబ్బంది, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

## లయన్స్ డిస్ట్రిక్ట్ 320జి - మీల్స్ ఆన్ వీల్స్



**కరీంనగర్, ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా 320జి ఆధ్వర్యంలో మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమం 908వ రోజుకు చేరుకుంది. కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో 200 మందికి పైగా అవసరార్థులకు ఉచిత అన్నప్రసాదం అందజేశారు.ఈ కార్యక్రమంలో లయన్ రంగురాజు (గోల్డెన్ టవర్ అధ్యక్షుడు), లయన్ జిల్లా కార్యదర్శి కృష్ణ (మానేరు) పాల్గొన్నారు. లయన్ రావికంటి కృష్ణ కిషోర్, మీల్స్ ఆన్ వీల్స్ చీఫ్ కోఆర్డినేటర్ (డిస్ట్రిక్ట్ హంగర్ రిలీఫ్) మాట్లాడుతూ, నిరంతరంగా జరుగుతున్న ఈ సేవా కార్యక్రమం ద్వారా అనేక మంది ఆకలితో ఉన్నవారికి ఆహారం అందుతోందని తెలిపారు.

## తండ్రిని చంపి.. డ్రమ్ములో కుక్కి

లక్నో యువకుడి ఘాతుకం

**లక్నో ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: తండ్రితో ఏదో విషయమై గొడవ పడిన ఒక కొడుకు దారుణ హత్యకు పాల్పడిన ఘటన ఈ నెల 20న లక్నోలో జరిగింది. మానవేంద్ర సింగ్ (50) అనే వ్యక్తి అదృశ్యమయ్యాడని ఇటీవల పోలీసులకు ఫిర్యాదు అందింది. వారు ఆయన కొడుకు అక్షత్ సింగ్(21)ను గట్టిగా ప్రశ్నించగా తన తండ్రిని ఒక గొడవ సందర్భంగా తుపాకీతో కాల్చి హత్య చేశానని అంగీకరించాడు.ఈ నేరం బయటకు తెలియకుండా ఉండేందుకు తన తండ్రి శరీరాన్ని ముక్కలు చేసి, కొన్ని భాగాలను బయట పారేశానని తెలిపాడు. మిగతా భాగాలను ఒక డ్రమ్ములో కుక్కి, ఇంట్లోనే ఒక ఖాళీ గదిలో ఉంచినట్టు వెల్లడించాడు. మానవేంద్ర శరీర భాగాలను పోలీసులు శవ పరీక్షకు పంపారు. ఫోరెన్సిక్ ఆధారాలను సేకరించి, నిందితుడిని కస్టడీకి తరలించారు.

## కరీంనగర్ పోలీస్ క్రీడాకారుల ఘన విజయం



**కరీంనగర్, ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
సైబరాబాద్ కమిషనరేట్‌లో జరిగిన రాష్ట్ర నాల్గవ పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో కరీంనగర్ కమిషనరేట్ పోలీస్ సిబ్బంది అద్భుత ప్రతిభ కనబరిచి 35 పతకాలు సాధించారు. ఇందులో 9 స్వర్ణ, 13 రజత, 13 కాంస్య పతకాలు ఉన్నాయి. మాధవి టేబుల్ టెన్నిస్‌లో రెండు స్వర్ణాలు, బాడ్మింటన్‌లో రజత, యోగాలో కాంస్య సాధించారు. స్వప్న మూడు స్వర్ణాలతో అగ్రస్థానంలో నిలిచారు. శ్రీజ రెండు స్వర్ణాలు, ఒక రజత సాధించారు. శ్రీధర్ స్విమ్మింగ్‌లో గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ గెలిచారు. సాయి దీప్ వాటర్ స్పోర్ట్స్‌లో ఒక స్వర్ణ, ఒక కాంస్య సాధించారు.ఇతర సిబ్బంది రెజ్లింగ్, పవర్ లిఫ్టింగ్, కబడ్డీ, యోగా, జూడో, బాడీ బిల్డింగ్, త్రో ఈవెంట్స్‌లో పతకాలు సాధించారు. ఈ విజయంపై పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం అభినందిస్తూ, కఠినమైన విధుల్లో ఉంటూనే క్రీడలలో ప్రతిభ చూపడం స్ఫూర్తిదాయకమని, జాతీయ స్థాయిలో మరింత ప్రతిభ కనబరచాలని సూచించారు.

## ముల్కనూర్ గ్రామంలో మెగా హెల్త్ క్యాంప్



**హుస్నాబాద్ నియోజకవర్గం, ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్**
: చిగురుమామిడి మండలం ముల్కనూర్ గ్రామంలో గ్రామ సర్పంచ్ సాంబారి భారతమ్మ, ఉప సర్పంచ్ పైడిపల్లి వెంకటేష్ ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి, డీఎంహెచ్‌ఓ టీం సహకరించగా గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.సీతారాంపూర్, పీచుపల్లి గ్రామాల ప్రజలు కూడా పాల్గొని క్యాంప్‌ను విజయవంతం చేశారు.

## కరీంనగర్ కమిషనరేట్‌లో కొత్త పోలీస్ డాగ్స్ చేరిక



**కరీంనగర్, ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నేర పరిశోధన వేగం పెంచేందుకు, భద్రతా చర్యలను బలోపేతం చేసేందుకు కరీంనగర్ కమిషనరేట్‌లో రెండు కొత్త పోలీస్ డాగ్స్ చేరాయి. హైదరాబాద్ మొయినాబాద్‌లోని ఐఐటీఏ శిక్షణ కేంద్రంలో తొమ్మిది నెలలపాటు శిక్షణ పొందిన రోలెక్స్ (ట్రాకర్), మాక్స్ (స్నిఫర్) కమిషనర్ కార్యాలయంలో రిపోర్ట్ చేశాయి.రోలెక్స్ నేరస్థుల అడుగుజాడలను గుర్తించడంలో, క్లూస్ టీమ్ తనిఖీలలో కీలక పాత్ర పోషించనుంది. శిక్షణలో రాష్ట్ర స్థాయిలో ఫిజికల్ ప్రొఫిషియన్సీ టెస్ట్‌లో బంగారు పతకం, ట్రాకింగ్‌లో కాంస్య పతకం సాధించింది. మాక్స్ పేలుడు పదార్థాలు, నిషేధిత వస్తువులను గుర్తించడంలో ప్రత్యేకత కలిగి, వీఐపీ భద్రతా కార్యక్రమాల్లో వినియోగించబడనుంది.ఇక, కరీంనగర్ పోలీస్ డాగ్ టైసన్ ఇటీవల ఐఐటీఏ శిక్షణ ముగింపు వేడుకల్లో ఎక్స్‌ప్లోజివ్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించింది. ఈ విజయాన్ని సీపీ గౌష్ ఆలం అభినందించారు.పోలీస్ డాగ్స్ అద్భుతమైన ఘ్రాణశక్తి, శిక్షణ సామర్థ్యం వల్ల క్లిష్టమైన కేసుల ఛేదనలో పోలీసులకు సహాయపడతాయని, కొత్తగా చేరిన సభ్యుల వల్ల జిల్లాలో భద్రతా వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని సీపీ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ భీంరావు, రిజర్వు ఇన్స్పెక్టర్ రజినీకాంత్, డాగ్ స్క్వాడ్ ఇంచార్జి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## యూరియా యాప్ ద్వారా పారదర్శక పంపిణీ



**కరీంనగర్, ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జనవరి 31 నుండి జిల్లాలో యూరియా అమ్మకాలు పూర్తిగా యాప్ ద్వారా మాత్రమే జరుగుతున్నాయి. ఈ యాప్ ద్వారా రైతులు తమ మండలంలో ఏ డీలర్ వద్ద యూరియా అందుబాటులో ఉందో తెలుసుకుని, ముందుగా బుక్ చేసుకుని 24 గంటల్లో బుకింగ్ ఐడి ఆధారంగా కొనుగోలు చేయవచ్చు. ఆధార్ ధృవీకరణతో పాటు భూమి యజమాని వివరాలు నమోదు చేసి కౌలు రైతులు కూడా యూరియా బుక్ చేసుకోవచ్చు. పట్టా పాస్‌బుక్ లేని రైతులు తమ సాగు భూమి వివరాలను మండల వ్యవసాయ అధికారికి సమర్పించి యూరియా పొందవచ్చు. తొలి విడతలో కొనుగోలు చేసిన రైతులు మళ్లీ 15 రోజుల తరువాత మాత్రమే బుక్ చేసుకునే అవకాశం ఉంది.జిల్లాలో ఇప్పటివరకు 84,663 మంది రైతులు 3,01,479 యూరియా బస్తాలను బుక్ చేసి, 2,69,215 బస్తాలను కొనుగోలు చేశారు. ప్రస్తుతం జిల్లాలో 1,510 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని వ్యవసాయ అధికారులు తెలిపారు. కాబట్టి రైతులు యూరియా దొరకదని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

## పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి


అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే



**కరీంనగర్, ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు జరగనున్న పదో తరగతి పరీక్షలను ప్రశాంతంగా, ఎలాంటి తప్పిదాలు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే ఆదేశించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో చీఫ్ సూపరింటెండెంట్లు, ఫ్లయింగ్ స్క్వాడ్స్, వాహన ఇన్‌చార్జీలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 73 రెగ్యులర్, 1 ప్రైవేట్ పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు.పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, ఫ్యాన్లు, వైద్య సిబ్బంది, విద్యుత్ అంతరాయం లేకుండా అన్ని వసతులు కల్పించాలని సూచించారు. మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా చూడాలని ఆదేశించారు. జిల్లాలో దాదాపు 650 మంది ఇన్విజిలేటర్లు పరీక్షల నిర్వహణలో పాల్గొంటారని, విద్యార్థులు సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా వాహన సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏడి మాధవి, ఏసీజీఈ సంధ్యారాణి, డిసిఈబి కార్యదర్శి భగవంతయ్య, కోఆర్డినేటర్లు అశోక్ రెడ్డి, శ్రీనివాసు, కృపారాణి, ఆంజనేయులు తదితర అధికారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ దుర్మార్గానికి పాల్పడుతోంది

బుర్ర శ్రీనివాస్ గౌడ్



**హుస్నాబాద్, ఫిబ్రవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుస్నాబాద్ నియోజకవర్గంలో గౌరవెల్లి ప్రాజెక్టును అడ్డం పెట్టుకుని రైతులను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, రాష్ట్ర గౌడ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్ర శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. మంగళవారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించిన ఆయన మాట్లాడుతూ, రాబోయే ఎంపీటీసీ, జెడ్పిటిసి ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం గౌరవెల్లి ప్రాజెక్టును రాజకీయంగా వాడుకుంటూ గ్రామీణ ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వమే ప్రాజెక్టు పనులను 90 శాతం పూర్తి చేసిందని, ప్రస్తుతం కాల్వల పనులు, భూసేకరణలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు.రైతు భరోసా, మున్సిపల్ ఎన్నికల హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం పదేపదే మాట తప్పుతోందని, ప్రజలు రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు. రైతులకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో హుస్నాబాద్ నియోజకవర్గ ప్రతినిధి ఐలేని మల్లికార్జున్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు పాకాల శ్యాంసుందర్ గౌడ్, గోపగోని అరవింద్ గౌడ్, యాస శ్రీనివాస్, పోతారం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ బీజేపీలో విలీనం అవుతుందని కాంగ్రెస్ ఆరోపణ



**కరీంనగర్, ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ ఆర్ అండ్ బి అతిథి గృహంలో జరిగిన విలేకరుల సమావేశంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి గజ్జల కాంతం మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ బీజేపీలో విలీనం కాబోతోందని ఆరోపించారు. బిఆర్ఎస్ ఇప్పటికే ప్రజల్లో విశ్వాసం కోల్పోయిందని, పార్లమెంట్, ఎమ్మెల్సీ, మున్సిపల్ ఎన్నికల్లో ఓటములు చవిచూసిందని పేర్కొన్నారు.కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాతో బిఆర్ఎస్ నేతలు చర్చలు జరిపారని, కేసీఆర్‌ను జైలుకు వెళ్లకుండా చూడటానికి బీజేపీతో చీకటి ఒప్పందం జరిగిందని ఆయన ఆరోపించారు. తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని, కేసీఆర్ కుటుంబం రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచేసిందని విమర్శించారు.బీజేపీ నేతలు హిందుత్వం పేరుతో ప్రజలను మభ్యపెడుతున్నారని, అభివృద్ధి గురించి మాట్లాడకుండా మతపరమైన నినాదాలతో ఓట్లు దండుకోవాలని చూస్తున్నారని గజ్జల కాంతం అన్నారు. కరీంనగర్ మేయర్ స్థానాన్ని గెలుచుకున్న బీజేపీ 1000 కోట్లు తెచ్చి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని సవాలు చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ మాట్లాడుతూ ప్రాజెక్టుల నిర్మాణంలో నాణ్యత లోపాలు బిఆర్ఎస్ పాలనలోనే జరిగాయని, కాలేశ్వరం ప్రాజెక్టు కుంగిపోవడం దానికి నిదర్శనమని అన్నారు. బిఆర్ఎస్ నేతలపై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఆకారపు భాస్కర్ రెడ్డి, గడ్డం నాగరాజు, ఎర్ర శ్రీనివాస్, సుద్దాల లక్ష్మణ్, సముద్రాల అజయ్, చొప్పదండి సత్యం తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపిన రాజేందర్ రావు



**కరీంనగర్, ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.బుధవారం నుంచి ప్రారంభమయ్యే పరీక్షల్లో విద్యార్థులు ప్రశాంతంగా రాయాలని, ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా ధైర్యంగా సమాధానాలు ఇవ్వాలని సూచించారు. మార్కుల కంటే జ్ఞానం, కృషి, ఆత్మవిశ్వాసమే ముఖ్యమని, తల్లిదండ్రులు, గురువులు గర్వపడేలా ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల నుంచి మొదటి సంవత్సరం 18,175 మంది, రెండవ సంవత్సరం 18,251 మంది విద్యార్థులు 57 పరీక్షా కేంద్రాల్లో హాజరవుతున్నారని తెలిపారు. కరీంనగర్ కీర్తిని దశదిశలా చాటేలా విద్యార్థులు ఉన్నత ఫలితాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

## ఏషియన్ పెయింట్ ఏజెన్సీపై 8వ రోజుకు చేరిన డ్రైవర్ల సమ్మె




**కరీంనగర్, ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

ఏషియన్ పెయింట్ గోదాంలో పనిచేస్తున్న డ్రైవర్లు తమ డిమాండ్ల సాధన కోసం చేపట్టిన సమ్మె ఎనిమిదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి, యూనియన్ గౌరవ అధ్యక్షుడు పున్నం రవి ఆధ్వర్యంలో అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు.డ్రైవర్లు తమ సొంత వాహనాలతో సరఫరా పనులు చేస్తూ, హమాలి లోడింగ్--అన్‌లోడింగ్ పనులు కూడా నిర్వహిస్తున్నప్పటికీ, ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీలు హమాలి చార్జీలు చెల్లించకుండా శ్రమదోపిడీ చేస్తున్నాయని ఆయన విమర్శించారు. పెరుగుతున్న డీజిల్ ధరలకు అనుగుణంగా ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు పెంచాలని, బిల్లులు ప్రతి నెల 10వ తేదీ లోపు ఇవ్వాలని డిమాండ్ చేశారు.యూనియన్ అధ్యక్షుడు కామల్ల మహిపాల్ మాట్లాడుతూ, యజమాన్యం బయట వాహనాలను తీసుకువచ్చి డ్రైవర్ల మధ్య గొడవలు సృష్టిస్తోందని ఆరోపించారు. సమస్యలు పరిష్కరించే వరకు నిరసనలు కొనసాగిస్తామని, డ్రైవర్లకు 10 లక్షల ఇన్సూరెన్స్ కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి కీసర మల్లేశం, కోశాధికారి ఉత్తమల్ల వెంకటేశ్, ఉపాధ్యక్షుడు వెంకటరెడ్డి, సహాయ కార్యదర్శి మూగ తిరుపతి, రవి, మహేష్, రమేష్, వెంకటేశ్, శ్రీనివాస్, నరేష్, మధు, కళాధర్, శ్రీకాంత్, విజయ్, రాజు, మోహన్‌తో పాటు 60 మంది డ్రైవర్లు పాల్గొన్నారు.

## నాగర్‌కర్నూల్ ఘటనపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేసిన సంపత్ ఉదయ్‌కుమార్



**గన్నేరువరం, ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

నాగర్‌కర్నూల్‌లో జరిగిన ఘటనపై రాష్ట్ర యువజన నాయకుడు సంపత్ ఉదయ్‌కుమార్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పసిపాపపై దాడి చేసి ప్రాణం తీసిన వారిని వెంటనే శిక్షించాలని, సంబంధిత ఎస్సైని సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. చిన్నారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.మైలారం గ్రామ సీనియర్ నాయకుడు జక్కనపెల్లి రాజ్‌కుమార్ కూడా స్పందిస్తూ, కులపిచ్చితో అమాయక ప్రాణాన్ని తీసిన వారిని వదిలిపెట్టరాదని అన్నారు. చిన్నారి కుటుంబానికి సానుభూతి తెలిపారు.

## ఉద్యోగుల ఆరోగ్య పథకంపై కరీంనగర్ జేఏసీ కృతజ్ఞతలు



**కరీంనగర్, ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన క్యాష్‌లెస్ హెల్త్ స్కీమ్‌పై కరీంనగర్ జిల్లా ఎంప్లాయిస్ జేఏసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. జేఏసీ చైర్మన్, టీఎన్జీవోల సంఘం అధ్యక్షుడు దారం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, 1056 కోట్ల రూపాయల నిధులతో హెల్త్ కేర్ ట్రస్ట్ ఏర్పాటు చేసి, ఉద్యోగుల వాటాకు సమానంగా ప్రభుత్వ కాంట్రిబ్యూషన్ ఇవ్వడం అభినందనీయమని తెలిపారు. సుమారు 17 లక్షల మంది ఉద్యోగులు, పెన్షనర్లకు ఈ పథకం ద్వారా ప్రయోజనం చేకూరుతుందని, 7.5 లక్షల మంది ఉద్యోగ పెన్షనర్లు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.1.2 కోట్ల బీమా, సాధారణ మరణం చెందిన ఉద్యోగులకు రూ.10 లక్షల బీమా వర్తింపజేయడం శుభపరిణామమని అన్నారు.హెల్త్ కేర్ ట్రస్ట్ నిధులను ఇతర అవసరాలకు మళ్లించకుండా కేవలం ఆరోగ్య రక్షణకే వినియోగించాలని, పూర్తిస్థాయి క్యాష్‌లెస్ వైద్య విధానం అమలు చేసి, ఉద్యోగులందరికీ డిజిటల్ హెల్త్ కార్డులు జారీ చేయాలని కోరారు. ఈ సందర్భంగా రాష్ట్ర కేబినెట్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మారం జగదీశ్వర్, ముజీబ్ హుస్సేనీతో పాటు జేఏసీ నాయకులు, జిల్లా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎస్సారెస్పీ నీళ్లతో చెరువుకు జలకళ

### సంతోషం వ్యక్తం చేసిన గ్రామస్థులు



**పాలకుర్తి, ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పాలకుర్తి మండల కేంద్రంలోని చెరువు ఎండిపోవడంతో గ్రామంలో నీటి ఎద్దడి ఏర్పడే పరిస్థితి నెలకొంది. ఈ సమస్యను సర్పంచ్ పెద్దపల్లి తిరుమల ఆజిమల్లు రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కన్ సింగ్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి ఎస్సారెస్పీ అధికారులను సంప్రదించారు.ఆదేశాల మేరకు చెరువులోకి నీళ్లు మళ్లించడంతో వారం రోజులుగా చెరువు నిండిపోయి మళ్లీ జలకళను సంతరించుకుంది. చెరువు నిండు కుండలా మారడంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేసి ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. వేసవికాలంలో నీటి కరువు లేకుండా ఉండేందుకు చెరువులోకి ఎస్సారెస్పీ నీళ్లు కొనసాగించాలని గ్రామస్థులు కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఐద బుగ్గ రామస్వామి, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## కొండాపూర్ గ్రామంలో యువకుడు ఆత్మహత్య



**హుస్నాబాద్ , ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్**

చిగురుమామిడి మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన దురిశెట్టి రమేష్ అనే యువకుడు గ్రామంలోని వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గజ ఈతగాళ్ల సహాయంతో శవాన్ని బయటకు తీశారు. అనంతరం పంచనామ నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## శాతవాహన విశ్వవిద్యాలయంలో పీహెచ్డీ ప్రవేశ మౌఖిక పరీక్షలు




**కరీంనగర్, ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

శాతవాహన విశ్వవిద్యాలయంలో పీహెచ్డీ ప్రవేశ మౌఖిక పరీక్షలు ఫిబ్రవరి 27న ఉదయం 10:30 గంటలకు ఆయా విభాగాధిపతుల కార్యాలయాల్లో నిర్వహించబడనున్నాయి.ఆర్ట్స్ కళాశాలలో ఉర్దూ, అర్థశాస్త్రం, సామాజిక శాస్త్రం విభాగాల్లో, సైన్స్ కళాశాలలో వృక్షశాస్త్రం, రసాయన శాస్త్రం, భౌతిక శాస్త్రం విభాగాల్లో, కామర్స్ కళాశాలలో వాణిజ్యశాస్త్ర విభాగంలో పరీక్షలు జరుగుతాయని అధికారులు తెలిపారు.ఇతర వివరాలు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో చూడవలసిందిగా అడ్మిషన్స్ డైరెక్టరేట్ సంచాలకుడు డా. మహమ్మద్ జాఫర్ సూచించారు.

## నాగర్‌కర్నూల్ జిల్లాకు కేటీఆర్ రాక



**నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

: నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర జాతరలో జరిగిన దాడిలో మరణించిన రెండేళ్ల పసిపాప కుటుంబాన్ని పరామర్శించేందుకు బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ రానున్నారు. బుధవారం ఉదయం 10:30 గంటలకు ఆయన బాధితులను కలిసి ధైర్యం చెప్పనున్నారు.ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి పిలుపునిచ్చారు.

# గిడ్డంగుల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి

## -ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి





**తిమ్మాపూర్, ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రైతులు పండించిన ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు గిడ్డంగుల నిర్మాణాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. తిమ్మాపూర్ మండలం రామకృష్ణ కాలనీలో 18,300 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాం నిర్మాణ పనులకు ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అధిక సామర్థ్యం గల ఆధునిక గోదాములను రాష్ట్రవ్యాప్తంగా నిర్మిస్తున్నామని, కరీంనగర్ జిల్లా వరి దిగుబడులకు తగ్గట్టుగా గిడ్డంగులు అందుబాటులో ఉండాలని అన్నారు. రామకృష్ణ కాలనీలో గోదాం నిర్మాణానికి 19 కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని, దీనికి రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు సహకరించారని తెలిపారు. రాయల నాగేశ్వరరావు మాట్లాడుతూ, గిడ్డంగుల నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, పనులను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుజ్జుల శ్వేత, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారు రమేశ్, మాజీ అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు. రాష్ట్ర స్థాయి సీఎం కప్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన తిమ్మాపూర్ మండలం మహాత్మానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులను ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సన్మానించారు. ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్‌లో విద్యార్థినులకు శాలువాలు కప్పి సన్మానం చేశారు. జాతీయ, అంతర్జాతీయ వేదికలపై రాణించాలని, పతకాలు సాధించి మన కీర్తిని ఖండాంతరాలకు చాటాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పొన్నాల సంపత్, ఉప సర్పంచ్ కేతిరెడ్డి లింగారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నంబర్ ప్లేట్లపై ట్రాఫిక్ పోలీసుల కఠిన చర్యలు



**కరీంనగర్, ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నగర పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఆదేశాల మేరకు కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ కార్నర్ వద్ద ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కరీం ఉల్లా ఖాన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆకస్మిక తనిఖీల్లో నంబర్ ప్లేట్లు లేని వాహనాలు, ఫ్యాన్సీ నంబర్ ప్లేట్లు, అస్పష్టంగా ఉన్న లేదా ట్యాంపరింగ్ చేసిన నంబర్ ప్లేట్లు, ఇర్రెగ్యులర్ నంబర్ ప్లేట్లు కలిగిన వాహనాలపై చర్యలు తీసుకున్నారు. ఈ డ్రైవ్‌లో మొత్తం 43 వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాహన యజమానులపై జరిమానా విధించి, నిబంధనలకు అనుగుణంగా సరైన నంబర్ ప్లేట్లు అమర్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం స్పష్టమైన నంబర్ ప్లేట్లు కలిగి ఉండాలని, నంబర్ ప్లేట్లను మార్చడం లేదా అస్పష్టంగా ఉంచడం చట్టరీత్యా నేరమని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

# అక్రమ ఇసుక రవాణాపై విజిలెన్స్ కఠిన చర్యలు



**కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులు మానేరు వాగు నుండి అనుమతులు లేకుండా ఇసుకను రవాణా చేస్తూ కరీంనగర్ వైపు వస్తుండగా మగ్దుంపూర్ వద్ద విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. ఈ ట్రాక్టర్లను కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించగా, సిఐ నిరంజన్ రెడ్డి కేసు నమోదు చేసి వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నేరస్తులను కోర్టులో అప్పగించారు. గత కొద్దిరోజులుగా గొల్లపల్లి వాగు నుండి అక్రమ రవాణా జరుగుతుండగా, రెండోసారి పట్టుబడిన వారికి లక్ష రూపాయల వరకు జరిమానా విధిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇకపై అక్రమ రవాణా కొనసాగితే పిడి యాక్ట్ కింద కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై దృష్టి పెట్టాలి

## - కలెక్టర్ కోయ శ్రీహర్ష



**పెద్దపల్లి, ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ పనులపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికల కోడ్ ముగిసినందున పట్టణాల్లో కొత్తగా మంజూరైన ఇండ్ల పనులు వేగవంతం చేయాలని, ప్రతి వార్డులో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి పనులు ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో మంజూరైన ఇండ్లు మార్చి 5 నాటికి బేస్మెంట్ స్థాయికి చేరుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఉపాధి హామీ పనులు, స్వచ్ఛ భారత్ మిషన్ కింద మరుగుదొడ్ల నిర్మాణానికి వచ్చే చెల్లింపులు లబ్ధిదారులకు చేరేలా చూడాలని సూచించారు. పెట్టుబడి సమస్యలతో బాధపడుతున్న నిరుపేదలకు మహిళా సంఘాల ద్వారా లక్ష రూపాయల రుణం అందించాలని, అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను ఎల్2 జాబితాలోని లబ్ధిదారులకు కేటాయించాలని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో పీడీ హౌసింగ్ రాజేశ్వర్, ఎంపిడిఓలు, ఏఈలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా పీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీనుబాబు జన్మదిన వేడుకలు



**పెద్దపల్లి, ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిల్లా శ్రీనుబాబు జన్మదిన వేడుకలను జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద జిల్లా సర్పంచ్ ఫోరం నాయకుడు ఆర్ల నాగరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, లద్నాపూర్ సర్పంచ్ వనం రామచంద్రరావు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల గుండెల్లో అభిమానం సంపాదించుకున్న నాయకుడని కొనియాడుతూ, ఆయురారోగ్యాలతో నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. రానున్న రోజుల్లో పార్టీ లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ప్రార్థించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో శ్రీనుబాబు కృషి ఎనలేనిదని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముత్తారం మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు బియ్యని శివకుమార్, పన్నూరు సర్పంచ్ మహేష్, తోటగోపాయ్యపల్లి సర్పంచ్ రమేష్, నగరంపల్లి సర్పంచ్ శ్రీలత, నాగారం సర్పంచ్ శ్రీదేవి రెడ్డి, కన్నాల సర్పంచ్ గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

# కుమ్మెర గ్రామంలో కుల దురహంకార దాడులపై సిపిఎం నిరసన




**ఉప్పునుంతల, ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో పెత్తందారుల కుల దురహంకార దాడులను నిరసిస్తూ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో సిపిఎం, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. సిపిఎం మండల కార్యదర్శి చింతల నాగరాజు మాట్లాడుతూ కుమ్మెర జాతరలో పసిపాపను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, ముఖ్యమంత్రి స్పందించాలని కోరారు. బాధితులకు న్యాయం జరిగే వరకు ప్రజాసంఘాలు, సామాజిక సంఘాలు అండగా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు పానుగంటి రవి, అంబేద్కర్ సంఘం నాయకులు మేకల శేఖర్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# భారత్, ఇజ్రాయెల్‌తో షడ్భుజ కూటమి.

## . ప్రతిపాదించిన ఇజ్రాయెల్ ప్రధాని

**న్యూఢిల్లీ ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రధాని మోదీ ఇజ్రాయెల్ పర్యటన వేళ జెరూసలేం నుంచి ఒక కొత్త భౌగోళిక రాజకీయ కూటమిపై ప్రకటన వచ్చింది. పశ్చిమాసియాలో 'రాడికల్ గొడ్డలి'ని ఎదుర్కోవడమే లక్ష్యంగా ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు షడ్భుజ కూటమిని ప్రతిపాదించారు. ఇందులో ఇజ్రాయెల్, గ్రీస్, సైప్రస్‌లతో పాటు భారత దేశాన్ని ప్రధాన భాగస్వామిగా పేర్కొన్నారు.
ఈ కూటమిలో అరబ్, ఆఫ్రికన్, ఆసియా దేశాలు కూడా భాగస్వాములుగా ఉంటాయని ఇజ్రాయెల్ విదేశాంగ శాఖ వెల్లడించింది. ప్రస్తుతం ఒక పక్క ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొని ఉండగా, మరో పక్క నాటో తరహాలో కూటమి ఏర్పాటుకు తుర్కియే ఉత్సాహం చూపిస్తున్న వేళ ఈ కూటమిపై అంతర్జాతీయంగా ఆసక్తి నెలకొంది.

# పోలీస్ కమిషనరేట్ సమక్షంలో డ్రైవర్ల కోసం ఉచిత కంటి వైద్య శిబిరం




**కరీంనగర్, ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: రోడ్డు భద్రతను మెరుగుపరచడమే లక్ష్యంగా అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో డ్రైవర్లందరికీ ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నారు. సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ, డ్రైవర్ల కంటి చూపు రోడ్డు ప్రమాదాల నివారణలో కీలకమని, దృష్టి లోపం వల్ల జరిగే ప్రమాదాలను అరికట్టేందుకు ఈ శిబిరం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఫిబ్రవరి 27న అస్త్ర కన్వెన్షన్ హాల్, పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఈ శిబిరం జరగనుంది. ప్రైవేట్ వాహనాలు, టిజిఆర్టిసి, ఆటోలు, భారీ వాహనాల డ్రైవర్లందరూ ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ సోహం సునీల్, ఏసీపీలు వెంకటస్వామి, విజయకుమార్, శ్రీనివాస్, రమేష్, సతీష్, ఇన్స్పెక్టర్లు రామ్ చందర్ రావు, సృజన్ రెడ్డి, తిరుమల్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# జాతీయ కబడ్డీ జట్టుకు ఎంపికైన కరీంనగర్ వాసి రాపోలు పవన్




**గన్నేరువరం, ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలానికి చెందిన కబడ్డీ క్రీడాకారుడు రాపోలు పవన్ కుమార్ తెలంగాణ రాష్ట్ర సీనియర్ కబడ్డీ జట్టుకు ఎంపికయ్యారు. త్వరలో గుజరాత్‌లో జరగనున్న జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో ఆయన రాష్ట్ర తరపున ప్రాతినిధ్యం వహించనున్నారు. గ్రామస్థాయి నుండి ఎదిగి జాతీయ వేదికపై ప్రతిభను చాటేందుకు సిద్ధమైన పవన్‌కు గ్రామ ప్రజలు, క్రీడాభిమానులు శు భాకాంక్షలు తెలిపారు. గన్నేరువరం గ్రామ క్రీడాకారుడు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం గర్వకారణమని సీనియర్ కబడ్డీ క్రీడాకారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు చెన్నడి అమిత్ కుమార్, కార్యదర్శి బుర్ర మల్లేష్ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్ సంపత్ రావు, బుర్ర ఎల్లయ్య గౌడ్ పవన్ ఎంపికపై ఆనందం వ్యక్తం చేస్తూ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# సామాజిక సామరస్యానికి మధ్యవర్తిత్వమే మార్గం

## అంగన్వాడీలతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ



**ఆమనగల్లు, ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సమాజంలో శాంతి, సామరస్యం నెలకొల్పడంలో మధ్యవర్తిత్వం అత్యంత ప్రాముఖ్యత కలిగి ఉందని మహబూబాబాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సీనియర్ న్యాయవాది వై. చెన్న మల్లారెడ్డి అన్నారు. మంగళవారం సీడీపీఓ డోర్నకల్ ఆధ్వర్యంలో అంగన్వాడీలకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "చిన్న చిన్న వివాదాలకు కోర్టుల చుట్టూ తిరగకుండా, ఇరువర్గాల అంగీకారంతో సమస్య పరిష్కరించుకోవడం వల్ల సమయం, డబ్బు ఆదా అవుతుంది. అంగన్వాడీలు క్షేత్రస్థాయిలో పనిచేయడం వల్ల వివాదాలపై ముందుగానే అవగాహన కలుగుతుంది. అందువల్ల వారు సామరస్య వేదికల గురించి ప్రజలకు తెలియజేయాలి" అని సూచించారు. అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ వి. రాజ్‌కృష్ణ మాట్లాడుతూ, "బాల్యవివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో అంగన్వాడీల పాత్ర కీలకం. గ్రామీణ స్థాయిలో ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో వారు చేస్తున్న సేవ ప్రశంసనీయం. చట్టాలపై అవగాహన కలిగి ఉండటం కూడా అవసరం" అని అన్నారు. కార్యక్రమంలో డోర్నకల్ సీడీపీఓ లక్ష్మి, మహిళా సాధికారత సంఘాలు, అంగన్వాడీ సూపర్వైజర్లు, ఉపాధ్యాయులు, ఆయాలు పాల్గొన్నారు.

# 14 ఏళ్లు దాటిన బాలికలకు ఉచితంగా హెచ్‌పీవీ వ్యాక్సిన్..

## కేంద్రం కీలక నిర్ణయం



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24 :(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** : బాలికల ఆరోగ్యం విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సెర్వికల్ (గర్భాశయ ముఖద్వార) క్యాన్సర్ నివారణ కోసం ఉపయోగపడే హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను బాలికలకు ఉచితంగా అందజేయనుంది. 14 ఏళ్లు దాటిన బాలికలకు ఈ వ్యాక్సిన్ అందజేస్తారు. ఈ విషయాన్ని కేంద్ర ఆరోగ్య శాఖ వర్గాలు వెల్లడించాయి. హెచ్‌పీవీ (హ్యూమన్ ప్యాపిలోమా వైరస్) టైప్ 16, 18, హెచ్‌పీవీ 6, 11 అనే నాలుగు రకాల సెర్వికల్ క్యాన్సర్‌ల నుంచి హెచ్‌పీవీ వ్యాక్సిన్ రక్షిస్తుంది. ఈ వ్యాక్సిన్ ఉచితంగా అందజేస్తున్నప్పటికీ.. తీసుకోవాలా వద్దా అనే విషయంలో ఎవరికి వారు నిర్ణయం తీసుకోవచ్చు. అంటే స్వచ్ఛందంగా మాత్రమే వ్యాక్సిన్ తీసుకోవచ్చు. ప్రభుత్వం నుంచి ఎలాంటి ఒత్తిడి ఉండదు. ప్రభుత్వ వైద్య శాలల్లో ఉచితంగా అందజేస్తారు. త్వరలోనే ఈ వ్యాక్సినేసన్ కార్యక్రమం ప్రారంభమవుతుంది. ప్రపంచవ్యాప్తంగా 2006 నుంచి ఈ వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి. 160 దేశాల్లో ఈ వ్యాక్సిన్ తీసుకుంటున్నారు. ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా 50 కోట్ల డోసులు వినియోగమయ్యాయి. ఇవి సెర్వికల్ క్యాన్సర్ నుంచి 93-100 శాతం వరకు రక్షణ కల్పిస్తున్నాయి. ఈ వైరస్ చర్మం ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుంది. సాధారణంగా ఈ వైరస్‌ను అంతం చేసే శక్తి అమ్మాయిలకు ఉంటుంది. అయితే, హెచ్‌పీవీ 16, 18 వంటి రకాలు మాత్రం అంత త్వరగా లొంగవు. ఇవి క్యాన్సర్‌కు దారి తీస్తాయి. అందుకే వీటిని ఎదుర్కొనేందుకు వ్యాక్సిన్ తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. ఒక డోసు వ్యాక్సిన్ కూడా సమర్థంగా పని చేస్తుంది. అయితే, ప్రస్తుతం అందుబాటులో ఉన్న గార్డాసిల్-4 అనే వ్యాక్సిన్‌ను 15 ఏళ్లలోపు బాలికలు రెండు డోసులు తీసుకోవాలి. 15 ఏళ్లు దాటిన వారు 3 డోసులు తీసుకోవాలి. కనీసం రెండు డోసులు తీసుకోవడం తప్పనిసరి అని నిపుణుల సూచన.

# యువతితో శృంగారం.. జాతకాల సాకుతో పెళ్లికి నిరాకరణ..

## ఢిల్లీ హైకోర్టు ఏమన్నదంటే..!




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24 :(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** : అత్యాచారం కేసులో విచారణ ఎదుర్కొంటున్న వ్యక్తికి బెయిల్ ఇచ్చేందుకు ఢిల్లీ హైకోర్టు నిరాకరించింది. నిందితుడి బెయిల్ పిటిషన్ ను కొట్టివేసింది. నిందితుడు పెళ్లి చేసుకుంటానని హామీ ఇచ్చి బాధితురాలితో శారీరక సంబంధం పెట్టుకున్నాడని, ఆ తర్వాత జాతకాలు కలువలేదనే సాకుతో పెళ్లికి నిరాకరించాడని, ఇది భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ 69 ప్రకార తీవ్ర నేరమని, కాబట్టి నిందితుడికి బెయిల్ ఇవ్వలేమని, అతడి పిటిషన్‌ను కొట్టివేస్తున్నామని కోర్టు స్పష్టంచేసింది. వివరాల్లోకి వెళ్తే.. ఒక యువకుడు ఒక యువతిని పెళ్లి చేసుకుంటానని చెప్పి ఆమెతో శారీరక సంబంధం పెట్టుకున్నాడు. మన జాతకాలు బ్రహ్మాండంగా కలిశాయని, త్వరలో పెళ్లి చేసుకుందామని నమ్మబలికి పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆ తర్వాత యువతి పెళ్లి చేసుకుందామని అడగడంతో అతడు నిరాకరించాడు. దాంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు అతడిని, అతడి కుటుంబసభ్యులను పిలిపించి మాట్లాడటంతో.. పెళ్లి చేసుకుంటామని హామీ ఇచ్చి కేసును విత్‌డ్రా చేయించారు. ఆ తర్వాత కొన్ని రోజులకు జాతకాలు కలువలేదన్న సాకుతో పెళ్లికి నిరాకరించారు. దాంతో బాధితురాలు మళ్లీ కేసు పెట్టింది. జాతకాలు కలిశాయని, పెళ్లి చేసుకుందామని అతడు గతంలో తనకు పంపించిన వాట్సాప్ మెసేజ్‌లను పోలీసులకు చూపించింది. దాంతో పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారు. కోర్టు నిందితుడిని లొంగిపొమ్మని గడువు విధిస్తూ ఆదేశాలు జారీచేసింది. ఈ క్రమంలో నిందితుడు బెయిల్ కోసం ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ వేశాడు. కేసు పూర్వపరాలను పరిశీలించిన కోర్టు అతడికి బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది.

# తహవ్వుర్ రాణా పౌరసత్వాన్ని రద్దు చేయనున్న కెనడా



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24 :(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కెనడా ప్రభుత్వం ముంబై ఉగ్రదాడుల ప్రధాన సూత్రధారి తహవ్వుర్ హుస్సేన్ రాణా పౌరసత్వాన్ని రద్దు చేసేందుకు చర్యలు చేపట్టింది. కెనడా ప్రధాని మార్క్ కార్నీ భారత పర్యటనకు రానున్న నేపథ్యంలో ఆ దేశ ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు అంతర్జాతీయ మీడియాలో కథనాలు ప్రచురితమయ్యాయి. తహవ్వుర్ రాణా ప్రస్తుతం భారత్‌లో ఎన్ఐఏ అధికారుల కస్టడీలో ఉన్నాడు. కాగా 1997లో రాణా కెనడాకు వలస వెళ్లాడు. 2001లో 'ఇమిగ్రేషన్, రెఫ్యూజిస్ అండ్ సిటిజెన్‌షిప్ కెనడా' అతడికి కెనడా పౌరసత్వం ఇచ్చింది. ఇప్పుడు ఆ పౌరసత్వాన్ని రద్దు చేసేందుకు ఐఆర్‌సీసీ చర్యలు ప్రారంభించింది. దీనికి కారణం అతడిపై ఉన్న ఉగ్ర ఆరోపణలు కాదని, తప్పుడు పత్రాలతో పౌరసత్వం పొందడంపై ఈ చర్యలు చేపట్టామని వివరించింది. పౌరసత్వం కోసం రాణా దరఖాస్తు చేసుకున్న సమయంలో తాను టొరంటో నివాసినని పేర్కొన్నాడు. కానీ, ఆ సమయంలో అతడు షికాగోలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దీనిపై కొన్నేళ్లుగా దర్యాప్తు జరుగుతోంది. ఉగ్రవాద కార్యకలాపాల్లో పాల్గొన్నాడన్న ఆరోపణలపై తహవ్వుర్ 2009లో అరెస్టయ్యాడు. అమెరికా జైల్లో శిక్ష అనుభవించిన అతడిని యూఎస్ అధికారులు గతేడాది భారత్‌కు అప్పగించారు. కాగా, కెనడా ప్రధాని మార్క్ కార్నీ తన మూడు దేశాల పర్యటనలో భాగంగా ఫిబ్రవరి 26న భారత్‌కు రానున్నారు. ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక, దౌత్య సంబంధాల పునరుద్ధరణకు తమ ప్రభుత్వం ఆసక్తిగా ఎదురు చూస్తోందని కెనడా ప్రధానమంత్రి కార్యాలయం పేర్కొన్నది. భారత పర్యటన అనంతరం కార్నీ ఆస్ట్రేలియా, జపాన్‌కు వెళ్లనున్నారు. కెనడా ప్రధాని భారత పర్యటనపై ఆ దేశంలోని ఫోరం ఆఫ్ ఫెడరేషన్స్ సీఈవో రూపక్ ఛటోపాధ్యాయ మాట్లాడుతూ.. భారత్, కెనడా మధ్య రాజకీయ, వ్యవస్థీకృత సారూప్యతలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇరుదేశాలు కలిసి పని చేయడంవల్ల భవిష్యత్తులో అనేక పరస్పర ప్రయోజనాలు పొందే అవకాశం ఉందన్నారు.

# కడ్తాల్ లో భారీ వర్షం





**కడ్తాల్, ఫిబ్రవరి 24,( నీలగిరి ఎక్స్‌ప్రెస్ )** రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం మంగళవారం తెల్లవారుజామున కురిసింది. ముందుగా ఈదురు గాలులు ప్రారంభమై, రాత్రి సమయంలో అకాల వర్షం కుండపోతగా వర్షం పడింది. ఈకారణంగా రహదారులపై నీరు నిల్వ ఉండడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా అంతరాయం కలిగినట్లు సమాచారం. ఇదిలా ఉండగా, మామిడి పూత రాలడంతో పాటు,కూరగాయల తోటలకు నష్టం వాటిల్లడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ అకాల వర్షంతో నష్టాన్ని కలిగించే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు.

# ఉద్యమకారిణి, కళాకారిణి జలజక్క మరణం

## -- కళారంగానికి తీరని లోటు



**మహబూబాబాద్, ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మలిదశ తెలంగాణ ఉద్యమకారిణి, రచయిత్రి, గాయని జలజక్క అకాల మరణం కళాకుటుంబాలకు తీవ్ర విషాదాన్ని మిగిల్చిందని డిపిఆర్ఓ రాజేంద్రప్రసాద్, సాంస్కృతిక సారధి జిల్లా అధ్యక్షుడు కంబాలపల్లి సత్యనారాయణ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్యాన్సర్ కారణంగా ఆమె మరణించడం కళారంగానికి తీరని లోటు అని వారు పేర్కొన్నారు. మహబూబాబాద్ అమరవీరుల స్థూపం వద్ద జలజక్క చిత్రపటం ఎదుట నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై డీఎం కృష్ణవేణి, మెప్మా అధికారులు, కళాకారులు కోమిరే వెంకన్న, గడ్డం రాజమౌళి, రవీందర్ గౌడ్, బండ వెంకన్న, ఐలేష్ కుమార్, భరత్, యుగేందర్, పరమేష్, ప్రవీణ్ కుమార్, బిక్షపతి, కవిత, అశ్విని, కీర్తి తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారి మృతికి కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలి

## -కుల సంఘాల డిమాండ్




**మహబూబాబాద్, ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో రజక కుటుంబంపై జరిగిన దాడిలో చిన్నారి మృతి చెందడం పట్ల మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో పలు కుల సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. స్థానిక వివేకానంద స్వామి విగ్రహం నుండి మదర్ తెరిసా విగ్రహం వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి చిన్నారి మృతికి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, "రజక కుటుంబంపై జరిగిన దాడి యావత్ హిందూ సమాజాన్ని కలిచి వేసింది. కుల వృత్తిని నమ్ముకుని జీవిస్తున్న రజకులకు రక్షణ లేకుండా పోయింది. ఈ ఘటన సభ్య సమాజం సిగ్గుపడేలా చేసింది" అని పేర్కొన్నారు. నిందితులపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని వారు విమర్శించారు. బాధ్యులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలు కుల సంఘాల నాయకులు, రజకులు పాల్గొన్నారు.

# బిజినెస్

## ఐటీ ఆదాయ వృద్ధి 6 శాతం..

**2025-26లో 2 వేలు పెరిగిన ఉద్యోగాలు: నాస్కామ్**




**ముంబై, ఫిబ్రవరి 24:**
ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశీయ ఐటీ ఇండస్ట్రీ ఆశాజనక పనితీరు కనబరిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. 2025-26లో దేశీయ ఐటీ ఇండస్ట్రీ ఆదాయం 6.1 శాతం ఎగబాకి 315 బిలియన్ డాలర్లకు చేరుకోనున్నట్టు నాస్కామ్ అంచనావేస్తున్నది. అలాగే గడిచిన ఆర్థిక సంవత్సరంలో 282.6 బిలియన్ డాలర్లుగా ఉన్న ఐటీ కంపెనీల ఆదాయాన్ని 297 బిలియన్ డాలర్లకు సవరించింది. కిందటేడాది నమోదైన 5.9 శాతం కంటే ఈ ఏడాది 6.1 శాతం వృద్ధిని నమోదు చేసుకోనున్నట్టు నాస్కామ్ ప్రెసిడెంట్ రాజేశ్ నంబియర్ తెలిపారు. ఉద్యోగ కల్పనలో ఎల్లప్పుడూ ముందుండే ఐటీ రంగం ఈసారి కూడా అవకాశాలు 2.3 శాతం పెరిగి 59.50 లక్షలకు చేరుకోనున్నాయని చెప్పారు. కిందటేడాది చివరి నాటికి 58 లక్షల ఉద్యోగాలు కలిగివున్నారు. మొత్తంమీద ఈ ఏడాది కొత్తగా 1.35 లక్షల మంది టెక్నాలజీ నిపుణులు జతయ్యారని ఆయన చెప్పారు. కిందటేడాది వచ్చిన 1.33 లక్షల ఉద్యోగాలతో పోలిస్తే కేవలం 2 వేలు పెరిగారని తెలిపారు.

# ఈ రెండు వాహనాల జోరు..

**రికార్డు స్థాయిలో అమ్మకాలు..**
**ఈ స్కూటర్‌కు డిమాండ్ ఎక్కువ..!**

హోండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా జనవరి 2026లో భారత ద్విచక్ర వాహన మార్కెట్లో అనూహ్యంగా మంచి పనితీరును కనబరిచింది. ఈ కంపెనీ దేశంలో రెండవ అతిపెద్ద ద్విచక్ర వాహన తయారీదారు. గత నెలలో దాని మొత్తం అమ్మకాలు 519,579 యూనిట్లు. గత సంవత్సరం జనవరితో పోలిస్తే ఈ సంఖ్య 29 శాతం పెరుగుదలను సూచిస్తుంది. జనవరి 2025లో కంపెనీ 402,977 వాహనాలను విక్రయించింది. స్కూటర్లు, కమ్యూటర్ బైక్‌లు రెండూ ఈ వృద్ధికి గణనీయంగా దోహదపడ్డాయి.

**యాక్టివాకు అత్యంత డిమాండ్:**
యాక్టివా మరోసారి అత్యంత డిమాండ్ ఉన్న స్కూటర్‌గా నిలిచింది. జనవరిలో 271,924 మంది కస్టమర్లు ఈ స్కూటర్‌ను కొనుగోలు చేశారు.




అమ్మకాలు గత సంవత్సరంతో పోలిస్తే దాదాపు 63 శాతం గణనీయంగా పెరిగాయి. స్పష్టంగా యాక్టివా స్కూటర్ విభాగంలో బలమైన స్థానాన్ని కలిగి ఉంది.

**షైన్ 125 కంపెనీలో అత్యధికంగా అమ్ముకాలు:**
బైక్‌ల గురించి మాట్లాడుకుంటే, షైన్ 125 కంపెనీలో అత్యధికంగా అమ్ముడైన మోటార్‌సైకిల్. గత నెలలో 135,076 యూనిట్లు అమ్ముడైంది. అయితే గత సంవత్సరంతో పోలిస్తే అమ్మకాలు సుమారు 11 శాతం తగ్గాయి. జదీ యునికార్న్ 160 కూడా కస్టమర్ల అభిమానంగా నిలిచింది. 35,710 యూనిట్ల అమ్మకాలతో మూడవ స్థానంలో నిలిచింది.

**జనవరిలో 26,148 యూనిట్లు అమ్మకాలు:**
ఎంట్రీ లెవల్ విభాగంలో షైన్ 100 మంచి పనితీరును కనబరిచింది. జనవరిలో 26,148 యూనిట్లను అమ్మింది. ఇది గత సంవత్సరంతో పోలిస్తే దాదాపు 55 శాతం వృద్ధి. ఇంతలో డియో స్కూటర్ డిమాండ్ బలహీనంగా ఉంది. 13,855 యూనిట్లను అమ్మింది. గత సంవత్సరంతో పోలిస్తే దాదాపు 44 శాతం తగ్గుదల. డియో 125 అమ్మకాలు 11,607 యూనిట్లను సాధించాయి. CB 125 హార్నెట్ 8,752 కొనుగోళ్లను చూసింది. మిడ్-సైజ్ విభాగంలో జదీ 350 బలమైన పెరుగుదలను చూసింది. 5,500 యూనిట్లను అమ్మింది. ఇది సంవత్సరానికి 200 శాతం కంటే ఎక్కువ వృద్ధిని నమోదు చేసింది. లివో 4,433 యూనిట్లను విక్రయించగా, ఎస్పీ 160 అమ్మకాలు 2,474 కు తగ్గాయి. జదీ 350 హైనెస్ అమ్మకాలు 2,302 యూనిట్ల వద్ద దాదాపు స్థిరంగా ఉన్నాయి. మొత్తంమీద జనవరి 2026 హోండాకు బలమైన ప్రారంభం, యాక్టివా, షైన్‌లు కీలక పాత్ర పోషించాయి.

## మళ్లీ అదే జోరు.. బంగారం, వెండి ఉరుకులు..

బంగారం, వెండి ధరలు మళ్లీ ఉరుకులు పరుగులు పెడుతున్నాయి. మళ్లీ అదే జోరు కొనసాగిస్తున్నాయి. ఇటీవల రూ.2 లక్షల వరకు వెళ్లిన తులం బంగారం ధర.. ఇప్పుడు జోరందుకుంటోంది. నేనేందుకు తగ్గాలే అన్నట్లు పరుగులు పెడుతోంది. నిన్న ఒక్క రోజు 2 వేల రూపాయలకుపైగా ఎగబాకింది. అలాగే వెండి వెండి ధరలకు మళ్లీ రెక్కలొస్తున్నాయి. కిలో వెండి ధర 4 లక్షలకు వెళ్లగా ఇప్పుడు 1 లక్ష రూపాయలకుపైగా దిగి వచ్చింది. అయితే మళ్లీ రెండు రోజుల నుంచి పరుగులు పెడుతోంది. నిన్న ఒక్క రోజే వెండి ధర రూ25 వేల వరకు పెరిగింది. ఇక తాజాగా ఫిబ్రవరి 24వ తేదీన 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,61,360 వద్ద ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,47,910 ఉంది. ఇక వెండి కిలోపై 3 లక్షల 100 రూపాయల వద్ద కొనసాగుతోంది.



తాజాగా ప్రధాన నగరాల్లో ధరల వివరాలు: (10 గ్రాముల ధర)
హైదరాబాద్:
24 క్యారెట్ల ధర రూ.1,61,360
22 క్యారెట్ల ధర రూ.1,47,910
విజయవాడ:
24 క్యారెట్ల ధర రూ.1,61,360
22 క్యారెట్ల ధర రూ.1,47,910
ఢిల్లీ:
24 క్యారెట్ల ధర రూ.1,61,510
22 క్యారెట్ల ధర రూ.1,48,060
ముంబై:
24 క్యారెట్ల ధర రూ.1,61,360
22 క్యారెట్ల ధర రూ.1,47,910
చెన్నై:
24 క్యారెట్ల ధర రూ.1,62,120
22 క్యారెట్ల ధర రూ.1,48,610
బెంగళూరు:
24 క్యారెట్ల ధర రూ.1,61,360
22 క్యారెట్ల ధర రూ.1,47,910
కోల్‌కతా:
24 క్యారెట్ల ధర రూ.1,61,360
22 క్యారెట్ల ధర రూ.1,47,910
కేరళ:

# స్పోర్ట్స్

# సెమీస్‌కు ఇంగ్లండ్..

**బ్రూక్ కెప్టెన్ ఇన్నింగ్స్..**
**పాకిస్థాన్‌పై ఘనవిజయం**




**పల్లెకెలె**
టీ20 ప్రపంచకప్‌లో మాజీ చాంపియన్ ఇంగ్లండ్ సెమీస్ బెర్తును ఖరారు చేసుకుంది. సూపర్-8 దశలో భాగంగా ఇదివరకే శ్రీలంకను ఓడించిన ఆ జట్టు.. మంగళవారం పల్లెకెలెలో జరిగిన 'లో స్కోరింగ్ థ్రిల్లర్'లో పాకిస్థాన్‌ను 2 వికెట్ల తేడాతో చిత్తుచేసి సెమీస్ చేరుకుంది. పాక్ నిర్దేశించిన 165 పరుగుల ఛేదనను ఆ జట్టు.. 19.1 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి పూర్తిచేసింది. 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' హ్యారీ బ్రూక్ (51 బంతుల్లో 100, 10 ఫోర్లు, 4 సిక్సర్లు) సూపర్ సెంచరీతో కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడి ఒంటిచేత్తో ఆ జట్టును సెమీస్‌కు చేర్చాడు. పాక్ బౌలర్లలో షహీన్ అఫ్రిది (4/30), ఉస్మాన్ తారిఖ్ (2/31) రాణించినా బ్యాటింగ్, ఫీల్డింగ్ వైఫల్యాలతో ఆ జట్టుకు పరాభవం తప్పలేదు. మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన పాక్.. సాహిబ్‌జాదా ఫర్హాన్ (45 బంతుల్లో 63, 7 ఫోర్లు, 2 సిక్సలు), ఫకార్ జమాన్ (16 బంతుల్లో 25, 2 ఫోర్లు, 2 సిక్సలు) రాణించడంతో గౌరవప్రదమైన స్కోరు చేసింది. ఇక ఈ ఓటమితో సెమీస్ చేరే అవకాశాలను పాకిస్థాన్ మరింత సంక్లిష్టం చేసుకుంది.


**కెప్టెన్ షో**
మోస్తరు ఛేదనలో ఇంగ్లండ్ కూడా ఆరంభం నుంచే ఆపసోపాలు పడింది. షహీన్ అఫ్రిది వరుస ఓవర్లలో ఇంగ్లిష్ ఓపెనర్లను ఔట్ చేసి ఆ జట్టును దెబ్బకొట్టాడు. తొలి బంతికే ప్రమాదకర ఫిల్ సాల్ట్‌ను ఔట్ చేసిన అతడు.. మూడో ఓవర్లో బట్లర్ (2)నూ వెనక్కి పంపాడు. బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుకొచ్చిన ఇంగ్లండ్ సారథి క్రీజులో పట్టుదలగా ఆడినా అతడికి సహచరుల నుంచి మద్దతు కరువైంది. అఫ్రిదికి తోడు స్పిన్నర్ ఉస్మాన్ తారిఖ్ మాయతో ఆ జట్టు బెతెల్ (8), బాంటన్ (2), కరన్ (16) వికెట్లను నష్టపోయింది. అయినా బ్రూక్ మాత్రం పట్టు వీడలేదు. మిర్జా రెండో ఓవర్లోనే 76 మీటర్ల సిక్స్‌తో వేట మొదలుపెట్టిన అతడు.. నవాజ్ వేసిన పవర్ ప్లే ఆఖరి ఓవర్లో 4, 4, 6 బాది తన ఉద్దేశాన్ని చాటాడు. ఒకపక్క పాక్ బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు తీస్తూ ఇంగ్లండ్‌పై ఒత్తిడి పెంచినా కెప్టెన్ మాత్రం ఏకాగ్రత కోల్పోలేదు. 28 బంతుల్లోనే హాఫ్ సెంచరీ సాధించిన అతడు.. షాదాబ్ ఓవర్లో రెండు ఫోర్లు, ఓ సిక్స్‌తో 17 పరుగులు రాబట్టాడు. కరన్‌ను తారిఖ్ బోల్తా కొట్టించినా ఆల్‌రౌండర్ విల్ జాక్స్ (28) తో కలిసి ఆ జట్టును లక్ష్యం దిశగా నడిపించాడు. ఉస్మాన్ ఓవర్లో బౌండరీతో 90లలోకి వచ్చిన బ్రూక్.. అఫ్రిది 17వ ఓవర్లో 6,4తో తన కెరీర్‌లో తొలి టీ20 శతకాన్ని పూర్తిచేశాడు. శతకం తర్వాతి బంతికే అతడు ఔట్ అయ్యాడు. విజయానికి 5 పరుగులు అవసరమనగా నవాజ్ ఓవర్లో జాక్స్, ఒవర్టన్ నిష్క్రమించడంతో ఉత్కంఠ రేగినా ఆర్చర్ బౌండరీతో లాంఛనాన్ని పూర్తిచేశాడు.

**ఫర్హాన్ ఒక్కడే..**
పాక్ ఇన్నింగ్స్‌లో ఫర్హాన్ ఆటే హైలైట్. ఎప్పట్లాగే ఆ జట్టు ఒడిదొడుకులతో ఇన్నింగ్స్‌ను ప్రారంభించినా ఫర్హాన్ క్రీజులో నిలిచి 'మెన్ ఇన్ గ్రీన్'కు మెరుగైన స్కోరును అందించగలిగాడు. ఆర్చర్ రెండో ఓవర్లో ఓపెనర్ సయీం అయూబ్ (7) మరోసారి నిరాశపరచగా డాసన్ మూడో ఓవర్లో కెప్టెన్ సల్మాన్ అఘా (5) కూడా అతడినే అనుసరించాడు. ఈ క్రమంలో బాబర్ ఆజమ్ (25)తో కలిసిన ఫర్హాన్ ధాటిగా ఆడే యత్నం చేశాడు. కానీ పవర్ ప్లే తర్వాత ఈ జోడీ సింగిల్స్‌కు పరిమితమవడంతో స్కోరు వేగం తగ్గింది.
ఒవర్టన్ 11వ ఓవర్లో బాబర్ క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. అతడి స్థానంలో వచ్చిన ఫకార్ (23) రెండు బౌండరీలు, రెండు సిక్సర్లతో వేగంగా ఆడాడు. జాక్స్ 14వ ఓవర్లో రెండు సిక్సర్లతో అర్ధ శతకాన్ని పూర్తిచేసిన ఫర్హాన్‌ను ఒవర్టన్ 16వ ఓవర్లో ఔట్ చేశాడు. అక్కడ్నుంచి పాక్ ఇన్నింగ్స్ గాడితప్పింది. ఫర్హాన్ నిష్క్రమించే సమయానికి 15.1 ఓవర్లలో 122/3గా ఉన్న పాకిస్థాన్, ఆ తర్వాత 4.2 ఓవర్లలో 43 పరుగుల వ్యవధిలోనే 6 వికెట్లు కోల్పోయింది.
1 టీ20 ప్రపంచకప్‌లో కెప్టెన్‌గా అత్యధిక స్కోరు చేసిన వారిలో బ్రూక్‌దే అగ్రసానం. గేల్ (98) రెండో స్థానంలో ఉన్నాడు.
3 ఈ మెగా టోర్నీలో అత్యంత వేగవంతమైన శతకం సాధించిన వారిలో బ్రూక్ (50 బంతుల్లో)ది మూడో స్థానం. తొలి రెండు స్థానాల్లో గేల్ (47, 50) ఉన్నాడు.

**సంక్షిప్త స్కోర్లు**
పాకిస్థాన్: 20 ఓవర్లకు 164/9 (ఫర్హాన్ 63, ఫకార్ 25, డాసన్ 3/24, ఒవర్టన్ 2/26);
ఇంగ్లండ్: 19.1 ఓవర్లకు 166/8 (బ్రూక్ 100, జాక్ 28, అఫ్రిది 4/30, ఉస్మాన్ 2/31)

## తుది జట్టులోకి అక్షర్!..

**కుటుంబ కారణాలతో ఇంటికి రింకూ**



**చెన్నై:**
టీ20 ప్రపంచకప్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత్ ప్రస్తుతం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్నది. దక్షిణాఫ్రికా చేతిలో భారీ ఓటమి తర్వాత సెమీఫైనల్ బెర్తు అవకాశాలను కఠినంగా మారడంతో మిగిలిన రెండు మ్యాచ్‌లు టీమ్‌ఇండియాకు కీలకంగా మారాయి. జింబాబ్వేతో పోరు కోసం మంగళవారం భారత క్రికెటర్లు నెట్స్‌లో చెమటోడ్చారు. సఫారీలతో పోరులో తుది జట్టు కూర్పుపై తీవ్ర విమర్శలు రావడంతో మేనేజ్‌మెంట్ దిద్దుబాటు చర్యలకు దిగింది. వాషింగ్టన్ సుందర్ స్థానంలో వైస్ కెప్టెన్ అక్షర్‌పటేల్ దాదాపు ఖరారు అయినట్లు తెలుస్తున్నది. నెట్ సెషన్‌లో చాలాసేపు బౌలింగ్ చేయడం దీనికి మరింత బలాన్ని చేకూరుస్తున్నది. మరోవైపు కుటుంబ కారణాల రీత్యా రింకూసింగ్ ఉన్నఫళంగా ఇంటికి వెళ్లాల్సి వచ్చింది. తన తండ్రి కాన్‌చంద్‌సింగ్ ఆరోగ్య పరిస్థితి సరిగా లేకపోవడంతో దవాఖానలో చేర్పించినట్లు జట్టు వర్గాలు పేర్కొన్నాయి. దీంతో జింబాబ్వే పోరుకు రింకూ అందుబాటులో ఉండేది అనుమానంగా మారింది. రింకూ స్థానంలో శాంసన్‌ను తీసుకుంటారా లేక కుల్దీప్‌యాదవ్‌కు బెర్తు దక్కుతుందా అన్నది తేలాల్సి ఉంది.